ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, మే 7, 2026 | సంపుటి - 22 | సంచిక 218 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



## యువత నైపుణ్యంతోనే ఉపాధిసాధ్యం

ఐటి,పరిశ్రమలు,శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

- టాస్క్‌ఏటీసీ స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యాల పెంపు
- పెద్దపల్లిలో టాస్క్ ద్వారా శిక్షణ పొందిన 261 మందికి మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు
- డీఈఈటీ ద్వారా యువతకు ఉద్యోగ అనుసంధానం
- నమోదు కావాలని సూచన
- పెద్దపల్లిలో మెగా జాబ్ మేళాలో పాల్గొన్న మంత్రి, ప్రభుత్వ విప్ విజయ రమణారావు, ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే మక్కన్ సింగ్, కలెక్టర్ కోయ శ్రీ హర్ష

2

## మళ్లీ వస్తాం..!

- అవినీతి తిమింగలం కోసం ఏసీబీ వేట.!
- మహిళా శిశు సంక్షేమ శాఖలో ఏసీబీ సోదాలు
- అదనపు భాధ్యతల దే అవినీతి..
- ఏసీబీ చేతిలో అధికారి అవినీతి చిట్టా..!

జగిత్యాల ప్రతినిధి, (నినాదం): జగిత్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో దాదాపు మంగళవారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కు అధికారి లేకపోవడంతో బాధ్యత అవగాహన లేని అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో శాఖ పూర్తిగా అవినీతిమయం అయిందనే ఆరోపణలు ఊపందుకున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో పక్క ఆధారాలతో ఏసీబీ అధికారులు జగిత్యాల కలెక్టరేట్లో 8 మంది ఏసీబీ అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు.

▸▸వివరాలు 12లో..





## హైదరాబాద్ మెట్రో ఫేజ్2కు ఆమోదించండి

ఫేజ్-3కింద ఎయిర్‌పోర్ట్ ఫ్యూచర్ సిటీ కారిడార్

- కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో ప్రాజెక్ట్
- కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్ '2, మెట్రో ఫేజ్ '3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు.

న్యూఢిల్లీ,మే6(నినాదం): సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు భేటీ అయిన ఇరువురు నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

2

## మంచిర్యాల జిల్లాలో విషాదం

వేర్వేరు ఘటనల్లో నలుగురు రైతులు దుర్మరణం

- రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్, బీజేపీ డిమాండ్
- రూ.2 లక్షలు వ్యక్తిగత సహాయం ప్రకటించిన ఎమ్మెల్యే



మంచిర్యాల, మే 6 (నినాదం): ఆకాలం వర్షంతో కొనుగోలు కేంద్రాల వద్ద తాము పండించిన దాన్యంను తడవకుండా కాపాడుకునేందుకు అక్కడికి వెళ్లారు. భారీ వర్షం పడటంతో పాటు ఈదురుగాలులతో రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు రైతులు దుర్మరణం చెందారు. అందులో తండ్రీ కుమారులు సైతం ఉన్నాడు.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలో ఈ సంఘటన చోటు చేసుకుంది.

▸▸వివరాలు 7లో..

## రైతు డిక్లరేషన్.. ఓ బోగస్ పత్రం

### రైతులను వంచించిన రేవంత్, రాహుల్

- రైతు భరోసా ఎకరాకు 15 వేలు ఎందుకు ఇవ్వడం లేదు
- రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైంది
- కరోనా కన్నా డేంజర్ కాంగ్రెస్ పార్టీ
- కాంగ్రెస్‌కు పిండం పెడితేనే..రైతులకు న్యాయం
- బిఆర్ఎస్ హయాంలో ఠంచనుగా రైతుభరోసా ఇచ్చాం
- రైతు సంగ్రామ సదస్సులో కెటిఆర్ విమర్శలు

- రైతులు ధైర్యం కోల్పోవద్దు
- ఆత్మహత్యలకు అస్సలు పూనుకోవద్దు
- కాంగ్రెస్ పాలనలో వేయిమంది రైతులు మృతి
- వారందరికీ పదిలక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

2

వరంగల్,మే6(నినాదం):

రైతు డిక్లరేషన్ అనేది ఒక బోగస్ పత్రమని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. డిక్లరేషన్ పేరిట రైతులకు చిత్తు కాగితం ఇచ్చి మోసం చేశారని మండి పడ్డారు. డిక్లరేషన్ ఇచ్చిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. హనుమకొండలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని సూచించారు. రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగిందా అని అడిగారు.



## ధాన్యం కొనుగోళ్లపై బిఆర్ఎస్ విష ప్రచారం

- 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- 95 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- పౌరసరఫరాశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి



ధాన్యం కొనుగోలు విషయంలో బీఆరఎస్ తప్పుడు ప్రచారం చేస్తూ.. రైతులను ఆందోళనకు గురిచేయడంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు అంశంపై ప్రతిపక్షమైన బీఆరఎస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తూ, రైతులను అయోమయానికి గురిచేయడానికి ప్రయత్నిస్తోందన్నారు.

హైదరాబాద్,మే6(నినాదం):

తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరిస్తోందని, రైతుల సంక్షేమానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ రబీలో రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. దాదాపు 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ఇందులో భాగంగా 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం 2.63 లక్షల టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అకాల వర్షాలు, తీవ్రమైన ఎండల (హీట్ వేవ్) నుంచి ధాన్యాన్ని,

▸▸తరువాయి 2లో..

## రేషన్ షాపుల ద్వారా జొన్న, మొక్కజొన్న పంపిణీ

- బహిరంగ మార్కెట్‌లో వేలానికి ఇక స్వస్తి
- మొక్కజొన్న, జొన్న రైతులకు ప్రభుత్వం అండ



2

హైదరాబాద్, (నినాదం): రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రభుత్వం మరోసారి భరోసానిచ్చింది. మొక్కజొన్న, జొన్న పంటలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, సేకరించిన ధాన్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు రేషన్ దుకాణాల ద్వారా నేరుగా ప్రజల చెంతకు చేర్చేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.

## తమిళనాడు అసెంబ్లీ రద్దు

- ఉత్తర్వులు ఇచ్చిన గవర్నర్ విశ్వనాథ్
- నేటి విజయ్ ప్రమాణ స్వీకారం వాయిదా
- తమిళనాట మారుతున్న రాజకీయ సమీకరణాలు
- ఏకమవుతున్న డిఎంకె, అన్నాడిఎంకె పార్టీలు

### టివికె విజయ్‌కు తమిళ కాంగ్రెస్ మద్దతు

- ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జ్ గిరీశ్ చోడంకర్ ప్రకటన
- తిరుచ్చి సీటును వదులుకోబోతున్న విజయ్
- ఆ స్థానంలో త్రిష పోటీ అంటూ సోషల్ మీడియా కూత

▸▸వివరాలు 2, 6లో..



## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

- సిఎం అభ్యర్థిపై బిజెపిలో సమాలోచనలు
- ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు

2

కోల్‌కతా, నినాదం: పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో



వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

- ప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదు
- రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత

హైదరాబాద్,మే6(నినాదం):

ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. విద్య ద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని కవిత అన్నారు. 'నాణ్యమైన విద్య ఫీజుల నియంత్రణ'పై ఆమె రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉచిత విద్య,




వైద్యం ప్రభుత్వాల భాధ్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు.

2

## నేడు బీహార్ కేబినేట్ విస్తరణ

మంత్రివర్గంలో నితీశ్ తనయుడు నిశాంత్

2

## భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి బాధ్యతల స్వీకారం

గవర్నర్‌తో మర్యాదపూర్వక భేటీ





# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం

మెట్రో రెండో దశకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్నట్టు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెట్రో రెండో దశ డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని, శంషాబాద్ ఎయిర్‌పోర్టు`ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్`3 కింద చేపట్టాలని కోరారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్`2సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్`1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్`2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.వి□ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్`2 ప్రాజెక్ట్ ను భారత ప్రభుత్వం ? తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ ,భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్`3గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్`ఎఎ కిసంబంధించిన డీపీఆర్ ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచఎంఆరఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్

## ధాన్యం కొనుగోళ్లపై బిఆర్ఎస్ విష ప్రచారం

రైతులను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు, ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది' అని మంత్రి ఉత్తమ్ అన్నారు. తడిసిన ధాన్యాన్ని ఏం చేయాలి అనేది కూడా అధికారులకు సూచనలు చేశామని అన్నారు. ప్రతి కొనుగోలు సెంటర్లలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సివిల్ సపె□ు భవన్ లో కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి రోజు వెదర్ అలర్ట్ అన్ని కొనుగోలు సెంటర్లకు అందిస్తున్నామని..తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో ఎక్కువ కొనుగోలు సెంటర్ల ను ఏర్పాటు చేశామని... బీఆరఎస్ అధికారంలో ఉన్నప్పుడు కంటే కాంగ్రెస్ హయంలో ఎక్కువ మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఏ రైతుకు ఇబ్బంది వచ్చిన కంట్రోల్ సెంటర్ కు ఫిర్యాదు చేయొచ్చని అన్నారు. కేటీఆర్ ధాన్యం కొనుగోలు విషయంలో అవగాహన రహితంగా మాట్లాడుతున్నారని.. బీఆరఎస్ కు ఇప్పటికే ప్రజలు బొంద పెట్టారని మంత్రి ఉత్తమ్ అన్నారు.

## రేషన్ షాపుల ద్వారా జొన్న, మొక్కజొన్న పంపిణీ

రైతుల నుంచి కొనుగోలు చేసిన ఈ పంటలను బహిరంగ మార్కెట్‌లో వేలం వేసి మధ్యవర్తులకు లాభం చేకూర్చకుండా, సివిల్ సప్లై శాఖ ద్వారా రేషన్ షాపుల లో పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.పంట పండించిన రైతు నష్టపోకూడదనే ఉద్దేశంతో మొక్కజొన్న, జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ప్రజలకు ఈ పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. సాధారణంగా ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తుంది. దీన్ని అదునుగా తీసుకుని మధ్యవర్తులు తక్కువ ధరకే దక్కించుకుని లాభపడుతుంటారు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ, సేకరించిన ధాన్యాన్ని ప్యాకింగ్ చేయించి నేరుగా ప్రజలకు తక్కువ ధరకు పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 'ధాన్యం కేవలం మార్కెట్ సరుకుగా మిగిలిపోకూడదు.. అది పేదవాడి ఆకలి తీర్చి, పౌష్టికాహారంగా మారాలి' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల కేవలం సామాన్య ప్రజలకే కాకుండా, సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే వేలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించేలా మొక్కజొన్న, జొన్నల సరఫరాకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు పౌల్ట్రీ□ రైతులకు అవసరమైన మేరకు కూడా సరఫరా చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం పట్ల రైతులు, సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోం మంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే 9వ తేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సవి క్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసన సభా పక్ష సమావేశం జరుగుతుందని సవి క్ భట్టాచార్య తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట□ల ముఖ్యమంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గంలో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు.





# యువత నైపుణ్యంతోనే ఉపాధి సాధ్యం

**పెద్దపల్లి రూరల్, మే 6(నినాదం):**

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల దిశగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తుందని,రాష్ట్ర ఐటి, పరిశ్రమలు,శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.బుధవారం పెద్దపల్లి పట్టణంలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ,ప్రభుత్వ విప్ విజయరమణారావు,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.గతంలో జవహర్‌లాల్ నెహ్రూ నాలెడ్జ్ సెంటర్లు ఉండగా,ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా పెద్దపల్లిలో టాస్క్, రీజినల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గత రెండు సం,రాల్లో టాస్క్ ద్వారా శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందగా, 261 మంది ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీల్లో ఉపాధి పొందినట్లు పేర్కొన్నారు.నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయని,మంత్రి, ఎమ్మెల్యేల పట్ల గౌరవం ఉన్నప్పటికీ యువతకు తగిన నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగాలు రావని స్పష్టం చేశారు.ఇంజినీరింగ్,ఎం.సీ.ఏ,ఎం.ఏ. మ్యాథ్స్,ఎం.ఏ,ఫిజిక్స్ వంటి విద్యార్హతలు ఉన్నా పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగాలు సాధ్యం కాదని యువత గుర్తుంచుకోవాలని సూచించారు.ఈ రోజు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 77 కంపెనీలు పాల్గొని 4 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి ముందుకు వచ్చాయని,అయితే 1500 మంది మాత్రమే షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు.గోల్డ్ మెడలిస్ట్‌లు అయినా సరే సాఫ్ట్ స్కిల్స్,ప్రెజెంటేషన్ స్కిల్స్ లేకపోతే పరిశ్రమలకు పనికిరావని పేర్కొన్నారు.యువతకు తగిన నైపుణ్యాలు కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ,ఏ.టీ.సీ.సెంటర్లు,టాస్క్ సెంట ర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొంటూ,ప్రైవేట్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు పెంచేందుకు భారీ పెట్టుబడులను తీసుకువస్తున్నామని తెలిపారు.నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలనుకునే పెద్దపల్లి యువతకు స్కిల్ యూనివర్సిటీలో అవకాశాలు కల్పించి ఉపాధి కల్పించడం తన బాధ్యత అని మంత్రి హామీ ఇచ్చారు.తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ డిట్ దేశంలోనే ప్రత్యేకమైన వేదికగా ఉందని,ఇందులో నమోదు చేసుకుంటే అభ్యర్థుల నైపుణ్యాలను విశ్లేషించి తగిన పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు.ప్రతి విద్యార్థి ఈ వేదికలో నమోదు కావాలని సూచించారు.గత బీ.ఆర్.ఎస్, ప్రభుత్వం గ్రూప్ పరీక్షలను సక్రమంగా నిర్వహించలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్ 1,2,3,4 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.యువత నూతన సాంకేతికతలను ఆచరించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచిస్తూ, యువత సంక్షేమం కోసం ప్రతి నిమిషం పనిచేసే ప్రభుత్వం ఇదేనని పేర్కొన్నారు.పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ,తెలంగాణ ఏర్పడిన తర్వాత నిరుద్యోగ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని, బీ.ఆర్.ఎస్,హామీ ఇచ్చినా అమలు కాలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు ఒక లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు జరుగుతున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,డేటా సైన్స్ వంటి కొత్త అవకాశాలు వస్తున్నాయని పేర్కొన్నారు.విద్య,పరిశ్రమల అవసరాలు,ఉద్యోగ నైపుణ్యాల మధ్య సరిపోలిక సాధించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు,టాస్క్ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కేంద్రాల్లో ఉన్నత ప్రమాణాలు పాటిస్తున్నామని, ప్రతి విద్యార్థి,నిరుద్యోగ యువత ప్రభుత్వం అందిస్తున్న టాస్క్,ఏ.టీ.సీ, వంటి వనరులను సద్వినియోగం చేసుకుని మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలను సాధించాలన్నారు. విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ, రెండు సంవత్సరాల క్రితం పెద్దపల్లిలో టాస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టాస్క్ ద్వారా శిక్షణ పొందిన 261 మంది యువత ప్రస్తుతం ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీల్లో అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందారని చెప్పారు.అలాగే పెద్దపల్లిలో వీ–హబ్ ను కూడా ఏర్పాటు చేసి,స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు పెద్దపల్లి జిల్లాలో మెగా జాబ్ మేళాను పరిశ్రమల శాఖ,టాస్క్ సహాకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు.77 కంపెనీల వరకు మెగా జాబ్ మేళాలో రిజిస్టర్ కావడం జరిగిందని,ఐ.టీ, బి.పి.ఓ,మార్కెటింగ్,ఉత్పత్తి రంగం వంటి వివిధ రంగాలలోని కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.నేడు జరిగిన జాబ్ మేళా కార్యక్రమంలో 1200 మంది విద్యార్థులు షార్ట్ లిస్ట్ కావడం జరిగిందని,647 మల్లీ యువతకు అపాయింట్మెంట్ ఆర్డర్లు సిద్ధం చేశామని అన్నారు.అగ్ని వీర్,పోలీస్ ఉద్యోగుల ఎంపికలో ఆసక్తిగల నిరుద్యోగ యువతకు పెద్దపల్లి జిల్లాలో ప్రత్యేకంగా అవసరమైన శిక్షణ కార్యక్రమాలను అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.మెగా జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించడంలో సహకరించిన డీ.ఈ.ఈ.టి,టాస్క్,ఐటీ శాఖ అధికారులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ మాట్లాడుతూ,గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని, కొంతమంది ఆత్మహత్యలకు కూడా పాల్పడిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.యువత సంక్షేమంతోనే తెలంగాణ రైజింగ్, సాధ్యమవుతుందని,యువతకు మంచి భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదని,బీ.ఆర్.ఎస్ కూడా అనేక హామీలు ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు.ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం,మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో అనేక కంపెనీలను తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. రామగుండం ప్రాంతంలో సుమారు 30 వేల మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అక్కడ కూడా మెగా జాబ్ మేళాను నిర్వహించాలని మంత్రి గారిని కోరారు.సింగరేణి,ఎన్.టీ.పీ.సీ,వంటి సంస్థలు,ప్రభుత్వం కలిసి రామగుండంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్,రామగుండం మేయర్ మహంకాళి స్వామి,ఇతర అధికారులు,ప్రజాప్రతినిధులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవేపపి, వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. . రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలని అన్నారు. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆరఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో బీఆరఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. □ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు □ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి □ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? □ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడిని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా అని కవిత ప్రశ్నించారు.

## నేడు బీహార్ కేబినేట్ విస్తరణ

**పాట్నా,మే6(నినాదం):**

బీహార్‌లో ఈనెల 7న గురువారం కీలక మంత్రివర్గ విస్తరణ జరుగనుంది. గాంధీ మైదానంలో పెద్దఎత్తున ప్రమాణస్వీకార కార్యాక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నారు. బిహార్ మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్ మంత్రివర్గంలో చేరే అవకాశం ఉంది. జేడీయు నేతలు మంగళవారం రాత్రి జరిపిన సమావేశంలో ప్రభుత్వంలో చేరాలని నిశాంత్‌ను ఒప్పించినట్టు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి పాట్నా వచ్చిన కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సహా, జేడీయు నేతలు ప్రస్తుతం 7 సర్క్యులర్ రోడ్డులోని నితీశ్ కుమార్ నివాసంలో సమావేశం జరిపారు. ఈ సమావేశంలో మంత్రుల తుది జాబితాను ఆమోదించనున్నట్టు తెలుస్తోంది. చాలాకాలంగా యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉంటున్న నిశాంత్ ప్రభుత్వంలో చేరేందుకు కూడా తొలుత నిరాకరించారు. అయితే మంగళవారంనాడు జరిగిన జేడీయు సమావేశంలో సీనియర్ నేతలు ఆయనను ప్రభుత్వంలో చేరేందుకు ఒప్పించినట్టు తెలిసింది. ప్రభుత్వంలో ఆయన చేరడం పార్టీకి, రాష్ట్రానికి కూడా కీలకమని నచ్చచెప్పినట్టు సమాచారం. నిశాంత్ ప్రస్తుతం ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు, నితీశ్ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల ఫీడ్‌బ్యాక్‌ను సేకరించేందుకు పలు జిల్లాల్లో 'బిహార్ గుడ్‌విల్ యాత్ర' జరుపుతున్నారు. ఆయన గత మే 8న లాంఛనంగా జేడీయు లో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా ఆయనకు సభ్యత్వాన్ని అందజేశారు. కాగా, బిహార్ మంత్రివర్గ విస్తరణలో 27 మందికి చేటు కల్పించనున్నారు. బీజేపీ నుంచి 12 మంది, జేడీయు నుంచి 11 మంది, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) నుంచి ఇద్దరు, హెచఏఎం, ఆరఎలఎస్‌పీ నుంచి చెరొకరికి మంత్రివర్గంలో చోటు కల్పించనున్నారు.

## తమిళనాడు అసెంబ్లీ రద్దు

**చెన్నై,మే6(నినాదం):**

తమిళనాడులో టీవికే ప్రభుత్వం ఏర్పాటుపై ఓవైపు సస్పెన్స్ కొనసాగుతుండగా, మరోవైపు తమిళనాడు 16వ శాసనసభ (2021`26)ను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకల్ బుధవారంనాడు రద్దు చేశారు. ఈనెల 5 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. బలనిరూపణకు అవసరమైన మద్దతు లేఖలు అందించని కారణంగా విజయ్ పార్టీని కూడా గవర్నర్ ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించలేదు. దీంతో నేటి విజయ్ ప్రమాణం రద్దయ్యింది. మరోవైపు డిఎంకె పార్టీలు అనూహ్యంగా రంగంలోకి దిగాయి. కలసి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు చర్చలు మొదలు పెట్టినట్లు సమాచారం. దీంతో వారి బలం 120కి ఉన్నట్లుగా సామాచరం. ఇందులో కాంగ్రెస్, బిజెపిలను దూరం పెట్టాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. మరోవైపు ఈనెల 7న ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజయ్ సారథ్యంలోని టీవీకే ఆలోచనగా ఉంది. ఇందుకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ప్రమాణస్వీకారం మరింత జాప్యమయ్యే అవకాశం ఉంది. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను విజయ్ కలిశారు. కాంగ్రెస్ ఇచ్చిన మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి కోరారు. అయితే విజయ్ చూపిన సంఖ్యాబలంతో గవర్నర్ సంతృప్తి చెందలేదు. ప్రభుత్వం ఏర్పాటు టీవీకేకు తగినంత సంఖ్యాబలం లేదని భావించిన గవర్నర్ 118 మంది సభ్యులు సమకూరిన తర్వాత రావాలని సూచించినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో టీవీకే 108 చోట్ల గెలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 మంది సభ్యుల బలం సంపాదించలేకపోయింది. డీఎంకేతో పొత్తులో భాగంగా 5 సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ విజయ్‌కు మద్దతు ప్రకటించింది. విజయ్ గెలిచిన రెండు సీట్లలో ఒక సీటును మినహాయిస్తే టీవీకే సంఖ్యాబలం 112కు చేరుకుంది. దీంతో మరో ఆరుగురి మద్దతు టీవీకేకు అవసరమైంది. ప్రస్తుతం టీవీకేకు ఎవరు మద్దతు ఇవ్వనున్నారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. విజయ్‌కు మద్దతిచ్చే అవకాశాలను అన్నాడీఎంకే బుధవారంనాడు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఎడప్పాడి పళనిస్వామి నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలు సమావేశమై టీవీకేకు సపోర్ట్ ఇవ్వరాదని నిర్ణయించారు. డీఎంకే భాగస్వామ్య పార్టీ అయిన వీసీకే మద్దతును టీవీకే కోరినప్పటికీ ఆ పార్టీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వీసీకేకు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు.



## భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి బాధ్యతల స్వీకారం

హైదరాబాద్,మే6(ఆరఎనఎ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, మాజీ డిజిపి బి. శివధర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లోని 8 వ ఫ్లోర్ లో ఈ బాధ్యతలను చేపట్టారు. శివధర్ రెడ్డి ని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల (నార్కోటిక్స్) నిర్మూలన మరియు రహదారి భద్రత వంటి కీలక అంశాల్లో ఆయన తన అనుభవాలతో సాఫీగా కొనసాగేందుకు సహకరించనున్నారు. ఐపిఎస్ అధికారిగా 32 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ముఖ్యంగా, అంతర్గత భద్రత, మావోయిస్టులను జనజీవన స్రవంతిలో చేర్చే కార్యకలాపాలలో క్షేత్రస్థాయిలో విశేష సేవలందించారు. గతంలో ఇంటిలిజెన్స్ విభాగంతో పాటు పలు కీలక శాఖల్లో సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శివధర్ రెడ్డి రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం బి.శివధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో పలువురు ఐపిఎస్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి శ్రీ విజయ్ కుమార్, మల్కాజిగిరి సిపి శ్రీమతి బి. సుమతి, ఐ జి పి (పీ అండ్ ఎల్) గజరావు భూపాల్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.



# రైతు డిక్లరేషన్ ..ఓ బోగస్ పత్రం

రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. అన్ని పంటలు బోనస్ ఇచ్చి కొంటామన్నారని గుర్తుచేశారు. కౌలు రైతులకు ఎకరానికి రూ.14వేలు వస్తుందా అని ప్రశ్నించారు. పంటబీమా పథకం ఎక్కడకు పోయిందని అడిగారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఎప్పుడిస్తారన్నారు. దుక్కిదున్నే రైతులను దారుణంగా వంచించారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌ది మెగా రైతు మేళా కాదు.. దగా రైతు మేళా అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్ అని సెటైర్ వేశారు. చెడ్డీ గ్యాంగ్ కంటే డేంజర్ కాంగ్రెస్ నాయకులు అని విమర్శించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. బీఆరఎస్ హయాంలో క్రమం తప్పకుండా రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయంలో రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు పథకాన్ని 12 రాష్ట్రాలు కాపీ కొట్టాయని తెలిపారు. గతంలో రైతులు పెట్టుబడి కోసం అప్పుల పాలయ్యే వారని గుర్తుచేశారు. రైతులకు 11 విడతలుగా రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు సమయానికి ఇవ్వడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం ఒక్కసారే రైతు భరోసా ఇచ్చారని అన్నారు.డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని కేటీఆర్ అన్నారు. రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలని సూచించారు. దండం పెట్టడం కాదు.. కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి.. అట్లయితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. తాలు తీస్తే రైతులు నీ తోలు తీస్తారని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. మక్కలు కొనకపోతే నీ ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని వార్నింగ్ ఇచ్చారు.సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు.ఈ సవాల్‌ను రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వీకరిస్తారో చెప్పాలని అన్నారు. సమ్మక్క ` సారలమ్మ జాతరలో రూ.70 కోట్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా రేవంత్‌రెడ్డి అండ్ కో దోచుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఇన్నాళ్లూ చేసినవి తప్పుడు ఆరోపణలని తేలిపోయిందని.. ఇకపై ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి పేల్చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల కొనుగోలు తెలుసు... ధాన్యం కొనుగోలు తెలియదని ఎద్దేవా చేశారు. బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. య రియా బస్తాలు ఇచ్చేది తెలియదని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో బడేభాయ్ చెప్పినట్లుగా.. రాష్ట్రంలో చోటేభాయ్ ఆడుతున్నారని సెటైర్లు గుప్పించారు. రాహుల్‌గాంధీ గతంలో వరంగల్ వచ్చి రైతు డిక్లరేషన్ పేరుతో సభ పెట్టారని ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాడు మాట్లాడిన స్పీచ్ సభలో ప్రదర్శించామని.. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో 34హావి లు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఒక్క హావి కూడా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఇక్కడ రైతు సదస్సు పెడితే అక్కడ మైగా రైతు మేళా పెట్టారని ఎద్దేవా చేశారు. అన్నదాతలందరికీ రైతు బీమాను ఇవ్వని దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు.

### రైతులు ధైర్యం కోల్పోవద్దు..

రైతులు కాంగ్రెస్ నయవంచనకు బలికావద్దని.. గుండె ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని రైతు సోదరులకు బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. రెండేళ్లలో రాబంధు రాజ్యం పోయి.. రైతుబంధు కేసీఆర్ రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు సంగ్రామ సదస్సులో రైతుల పక్షాన నాలుగు తీర్మానాలు చేస్తున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ రాబంధు పాలనలో వెయ్యి మందికిపైగా రైతులు చనిపోయారని.. రోడ్డున పడ్డ ఒక్కో రైతు కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. రైతు సంగ్రామ సదస్సులో చేసిన తీర్మానాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి వి ద ఒట్టుపెట్టి రుణమాఫీ చేస్తానని అన్నాడని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఏ ఊరికైనా వెళ్లి అడుగుదాం.. ఒక్క ఊరిలోనైనా రైతులందరికీ రుణమాఫీ జరిగిందంటే రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ చారానా.. టోపీ బారానా అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రుణమాఫీ పూర్తికాక రైతులు పురుగుల మందు తాగారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అన్నీ దందాలు, కవిషన్లు, కొట్లాటలే అని విమర్శించారు. రేవంత్ రెడి 69సార్లు ఢిల్లీకి వెళ్లాడని.. కానీ 69 పైసలు కూడా తేలేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లి రేవంత్ రెడ్డి కప్పం కడుతున్నాడని తెలిపారు. రాష్ట్రంలో రాహుల్ బంధు నడుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజల గురించి పట్టించుకునే వాళ్లే లేరని అన్నారు. రైతులకు ఇవ్వడానికి పైసలు లేవు.. కానీ రాహుల్ గాంధీకి మాత్రం మ టలు పంపిస్తున్నాడని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులను నంబర్‌వన్ స్థానంలో నిలిపారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆగమైన తెలంగాణను బాగుచేసింది బీఆరఎస్ అని తెలిపారు. రైతు ప్రగతికి కేసీఆర్ అద్భుతమైన పథకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ కంటే రైతును బాగా చూసుకున్న నాయకుడు దేశంలోనే లేడని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో రైతు ప్రగతికి విప్లవం సృష్టించామని అన్నారు. పదేళ్లలో రైతులకు రూ.5లక్షల కోట్లు ఖర్చుపెట్టిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. కేసీఆర్ హయాంలో సాగు పెరిగి వరంగల్‌లో భూముల రేట్లు పెరిగాయని అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చాక భూముల ధరలు పడిపోయాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కోసం వానల్లో, ఎండల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్సెట్టిపేట కొనుగోలు కేంద్రంలో గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని తెలిపారు.

# గ్రామీణ విద్యార్థులకు రవాణా సౌకర్యమే ప్రధాన సమస్య

## విద్యనే సమాజ అభివృద్ధికి దోహదపడుతుంది.. ఎంపీ మల్లు రవి చొరవతో విద్యార్థుల సంక్షేమానికి ప్రోత్సాహం

### నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి





**నాగర్ కర్నూల్ మే 6 (నినాదం)**

నాగర్ కర్నూల్ ఐడిఓసి కార్యాలయ ఆవరణలో నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే కుమ్మెర, పెద్దాపూర్, గన్యాగుల, మంతటి, గగ్గలపల్లి, నార్లాపూర్, పాఠశాలల విద్యార్థులకు నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ప్రత్యేక చొరవతో, జిందాల్ స్టీల్ పవర్ సంస్థ సౌజన్యంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి పూర్తి చేసిన 130 మంది విద్యార్థులు, విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీని కార్యక్రమాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి లతో కలిసి ఎంపీ డాక్టర్ మల్లు రవి బుధవారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా కుమ్మెర గ్రామ విద్యార్థులు 48 మందికిఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి కలిసి సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు విద్యను కొనసాగించడంలో ఎదుర్కొనే ప్రధాన సమస్యలలో ఒకటి రవాణా సౌకర్యం అని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు, సైకిళ్లు అందించడం ద్వారా విద్యార్థులు పాఠశాలకు సమయానికి హాజరు కావడంతో పాటు, వారి విద్యపై ఆసక్తి మరింత పెరుగుతుందని ఎంపీ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని అందుకు కృషి చేసిన విద్యార్థులకు అధికారులకు ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంగన్వాడి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం సైతం అందించేందుకు కసరతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిందాల్ స్టీల్ పవర్ సంస్థ సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా సమాజానికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సంస్థ ఇలాంటి కార్యక్రమాలను విస్తరించాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటితో పాటు ప్రైవేట్ సంస్థల సహకారం ఉంటే విద్యా రంగం మరింత బలపడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సైకిళ్లు అందడం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు, చదువులో మంచి ఫలితాలు సాధించే అవకాశాలు ఎక్కువవుతాయని, విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని ప్రతిరోజు పాఠశాలకు హాజరుకావాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ. మొట్టమొదటిగా నాగర్ కర్నూల్ నియోజకవర్గం పరిధిలోని విద్యార్థులకు అందజేయడం చాలా సంతోషించదగ్గ విషయమని ఆయన ఎంపీకి సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8, 9 ,10,వ తరగతి విద్యార్థులకు షూ అందజేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే సి ఎస్ ఆర్ నిధులతో ఏర్పాటు చేయాలని ఎంపీ ని కోరగా, అందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ సిఎస్ఆర్ నిధులతో విద్యార్థులకు అవసరమైన షూను అందజేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎంపీ తెలిపారు.

సైకిళ్ల ద్వారా విద్యార్థులు సులభంగా పాఠశాలకు వెళ్లగలరని, తద్వారా వారి చదువు అంతరాయం లేకుండా కొనసాగుతుందని గ్రామీణ విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించే దిశగా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి సహాయం అందించిన ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిందాల్ స్టీల్ పవర్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సైకిళ్లు తమ చదువుకు ఎంతో ఉపయోగపడతాయని, ఇకపై మరింత కృషి చేసి మంచి ఫలితాలు సాధిస్తామని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, జింగల్ సంస్థ ప్రతినిధి రెడ్డి నాయక్ ,జిల్లా విద్యాశాఖ అధికారులు షర్ఫుద్దీన్, వెంకటేశ్వర్లు శెట్టి , పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన కమిషనర్‌కు స్వాగతం పలికిన పాలక వర్గం

**గద్వాల ప్రతినిధి మే 6 (నినాదం)**



జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ నియోజకవర్గంలో అయిజ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ రావు బుధవారం మున్సిపల్ ఛైర్మన్ సీఎం సురేష్ ను ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ను బి ఆర్ ఎస్ పాలకవర్గం శాలువా వేసి పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు. అనంతరం ఛైర్మన్ ఛాంబర్‌లో జరిగిన ఈ భేటీలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. పాలక వర్గం మరియు అధికారులు సమన్వయంతో ముందుకు సాగితేనే ఐజ పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తిరుమలేష్, రజాక్, శివ, డా. కృష్ణ,కో–ఆప్షన్ సభ్యులు నాగన్న గౌడ్.బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి, గజ్జి దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు కూలి



**బోధన్ ప్రతినిధి, మే 6 (నినాదం)**

ఉపాధి హామీ పథకంలో కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు కూలి పొందుతారని ఎంపీడీవో హెచ్. శ్రీనివాస్ అన్నారు. సాలురా మండలంలోని సాలురా క్యాంప్, సాలుర గ్రామాలలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను( ఎమ్ఐ ట్యాంక్ ) ఆయన పరిశీలించారు. మాస్టర్ రోల్స్, కూలీల హాజరు రిజిస్టర్ లను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం పూట పనులు చేయాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాబ్ కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, కూలీల సంఖ్య పెంచాలని, పని ప్రదేశంలో మంచినీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ లను ఆదేశించారు.

# మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపిన కామేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు

**ఖమ్మం, మే 6 (నినాదం)**

కామేపల్లి మండలంలో శాశ్వత సాగునీటి పరిష్కారం కొరకు కృషిచేసిన వ్యవసాయ శాఖ మాత్యులు, ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రదాత తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు మాజీ జెడ్పిటిసి మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్ కుమార్, టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం, మాజీ పీఎస్ఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు, గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆర్ ఎం రవి, మాజీ ఎంపీటీసీ గబ్రు నాయక్ తదితరులు మంగళవారం నాడు హైదరాబాదులో తుమ్మల నివాసంలో స్వయంగా మంత్రిని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో సాగునీటి రంగానికి బలాన్ని ఇచ్చే బుగ్గ వాగు ఎడమ వరద కాలువ పనులు సవరించిన అంచనాలకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలియజేయుటకు, కామేపల్లి మండలంలోని 25 కుంటలకు 2019 ఎకరాల ఆయకట్టు కు 24 గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీటి సమస్యకు పరిష్కారం, అదేవిధంగా రఘునాథపాలెం మండలంలో మొత్తం 13 గ్రామాలకు 31 చెరువులు బుగ్గ వాగు ద్వారా నిండే అవకాశం ఉందని, దీని ద్వారా సాగునీటి రంగానికి శాశ్వత పరిష్కారం చూపిన తుమ్మల కృషి, మరియు పట్టుదల కు కామేపల్లి మండల ప్రజలు వారి మేలును ఎప్పటికీ మరచిపోరని, అంతేకాకుండా గతంలో కూడా కామేపల్లి మండలంలో అనేక రోడ్ల తో పాటు, ఇల్లందు నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్ల పరిస్థితిని చూసి, నక్సలిజం ప్రాబల్య ప్రాంతాలలో, ఎవరు చేరుకోలేని ప్రాంతాలలో కూడా ధైర్యంగా ప్రాణాలకు తెగించి పర్యటించి రోడ్లు వేయించిన ఘనత వారికే దక్కిందని వారు తెలిపారు.



# ఉపాధి హామి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



**నిజామాబాద్ ప్రతినిధి, మే 6 (నినాదం) :**

ఉపాధి హామి కూలీలకు సౌకర్యాలు కల్పించాలని, 100 రోజుల పని కాకుండా 200 రోజుల పని కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బెజ్గం సుజాత అన్నారు. బుధవారం మాక్లూర్ మండలం చిన్నాపూర్ గ్రామంలో ఐద్వా కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఐద్వా ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ చిన్నాపూర్ గ్రామంలో ఉపాధి కూలీలకు టెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతుంటే కూలీ రేట్లు మాత్రం ఒక రూపాయి కూడా పెరగట్లేదని, కాబట్టి 300 రూపాయలు కాకుండా 600 రూపాయలు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేబర్ కార్డు సౌకర్యం ఉన్న ప్రతి ఉపాధి కూలీ కి పని భద్రత, ప్రమాద బీమా కల్పించాలని, వారి కుటుంబానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పల్లెపు వెంకటేష్, పార్టీ సభ్యులు చిన్న సాయిలు, చిన్నాపూర్ ఐద్వా గ్రామ కమిటీ సభ్యులు శారద, రాధా, లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



# వేసవిలో నీటి సమస్య లేకుండా అధికారులు దృష్టి సారించాలి

### వేపకుంట్ల సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి

**ఖమ్మం, మే 6 (నినాదం ):**

వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ముందస్తు తగు చర్యలు తీసుకోవాలని వేపకుంట్ల గ్రామ సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి అంటారు. బుధవారం ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాధపాలెం మండలం వేపకంట్ల గ్రామసర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా అధ్యక్షత నందు గ్రామ పంచాయతీ పాలక వర్గ సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది ఈ సందర్భంగా వేసవి కాలం దృష్ట్యా నీటి సరఫరా లో అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవసరం అయినా మోటార్లు పైపులు బోరు రిపేర్లు వంటివి సరిచేయాలని వీధి దీపాలు నిర్వహణ పరిశుభ్రత పై దృష్టి సారించాలి అనీ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నేలాల అశ్విని గురవయ్య సెక్రటరీ అనిల్ వార్డు సభ్యులు నవీన్ వీరబాబు శ్యామ్ గ్రామ పెద్దలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 200 క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం అగ్నికి ఆహుతి

**మధిర, మే 6 (నినాదం):**



మధిర నియోజకవర్గం ముదిగొండ మండలం ముత్తారం గ్రామ పరిసరాల్లో విషాద ఘటన చోటుచేసుకుంది. సమీప గ్రామమైన వనం వారి కృష్ణా పురానికి చెందిన రైతు షేక్ ఖాసిం కౌలుకు తీసుకున్న 5 ఎకరాల్లో మొక్కజొన్న పంట పండించి, కోత అనంతరం రాశులుగా పోసి నిల్వ ఉంచారు. అయితే పక్క పొలాల నుంచి వ్యాపించిన మంటల కారణంగా సుమారు 200 క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం అగ్నికి ఆహుతి అయింది. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించిన రైతు షేక్ ఖాసిం తీవ్రంగా శ్రమించగా, అతని కాళ్ళకి బొబ్బలు కూడా వచ్చాయి. ఎంతో కష్టపడి పండించిన పంట క్షణాల్లో మంటల్లో కలిసిపోవడంతో రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఈ సందర్భంగా షేక్ ఖాసిం మాట్లాడుతూ తనకు జరిగిన ఈ దురదృష్టకర నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

## కుట్టుమిషన్ల పంపిణీలో సింహభాగం

# మేర కులస్తులకు కేటాయించాలి

### వెనుక బడిన తరగతుల సహకార సంస్థ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ కు మేరు సంఘం నాయకుల వినతి

**నిజామాబాద్ ప్రతినిధి, మే 6 (నినాదం)**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టనున్న బీసీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీలో సింహాభాగం మేర కులస్తులకు కేటాయించాలని కోరుతూ తెలంగాణ వెనుక బడిన తరగతుల సహకార సంస్థ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ కు హైదరాబాద్ లో తన ఛాంబర్ లో మేరు సంఘం నాయకులు కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ప్రతి నియోజకవర్గానికి బీసీ మహిళలకు ఆధునిక కుట్టు మిషన్ల పంపిణి కార్యక్రమం చేపట్టనున్న దృష్ట్యా మేరు కులస్థులు కుట్టు మిషన్ పై జీవనదారం గడుస్తుందని, రెడీ మేడ్ మహమ్మారి కులావృత్తి పై గుది బండలా తయారైనదని పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి వారికి కొంత లో కొంత ఊరట కలిగించే ఉచిత కుట్టు మిషన్లు పంపిణి కార్యక్రమం కులస్థులకు భరోసా కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో మేరు సంఘం ఉత్తర తెలంగాణ జిల్లా లైన నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సోమ హన్మంత్ రావు, ఉపాధ్యక్షులు కొట్టూర్ చంద్రకాంత్,సంయుక్త కార్యదర్శి గడ్డం నరేందర్, నిజామాబాద్ నగర అధ్యక్షులు వెన్ను దేవానంద్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సరికొండ నారాయణ, నిర్మల్ జిల్లా అధ్యక్షులు పూసపత్రి సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్ టైలర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు వెన్ను లింబాద్రి పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించిన తాసిల్దార్

**ఆర్మూర్ మే 6 (నినాదం):**



బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి ఆధ్వర్యంలో, సొసైటీ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను, మోర్తాడ్ మండల తాసిల్దార్ చిలుక కృష్ణ బుధవారం రోజున ఆయా గ్రామాలను సందర్శించి కొనుగోలు కేంద్రాలలో పనితీరును, సొసైటీ కేంద్రాలలో వరి వరి కొనుగోలుతో పాటు, రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన అధికారులను మోర్తాడ్ తాసిల్దార్ సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు తలెత్తిన, తమ దృష్టికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా కృషి చేస్తానని తాసిల్దార్ చిలుక కృష్ణ పేర్కొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు




**నారాయణపేట ప్రతినిధి, మే 6, (నినాదం):**

జిల్లా కేంద్రంలో బి ఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన పార్టీ శ్రేణులు. పట్టణ అధ్యక్షుడు విజయ్ సాగర్ ఆధ్వర్యంలో పట్టణంలోని తఖి బాబా దర్గాలో, అలాగే గొడుగు గేరి శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో రాజేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా అభిషేకం పూజలు చేయడం జరిగింది, పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ రాబోయే ఎలక్షన్లలో మాజీ శాసనసభ్యులు రాజేందర్ రెడ్డి కోసం నిరంతరం శ్రమిస్తూ వారిని గెలిపించుకోవాల్సిందిగా కార్యకర్తలను కోరారు. పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ చేసిన అనంతరం సత్యనారాయణ స్వామి చౌరస్తాలో అల్పాహార వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమంలో కౌన్సిలర్ భరత్, నారాయణమ్మ చెన్నారెడ్డి, కన్నా జగదీష్, ప్రతాప్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, స్టాంపు రాంరెడ్డి, బుల్లెట్ రాజు, మైనార్టీ నాయకులు సలీం అడ్వకేట్, మహమూద్ అన్సారి, చాంద్, మైనార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా

**కల్వకుర్తి మే 6 (నినాదం)**



కల్వకుర్తి పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు బుధవారం ఉదయం పెంచిన వంట గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముందు చూపు లేక పోవడం ద్వారా రాష్ట్రంలో ఏర్పడ్డ వంట గ్యాస్ డీజీలు పెట్రోల్ కొరతను తక్షణమే నివారించకపోతే ప్రజా ఉద్యమం తప్పదని అన్నారు. ఎన్డీఏ అధికారంలోకి రాక ముందు 450 రూపాయలు ఉన్న సిలిండర్ ధర నేడు 900 వందల రూపాయలు పెరిగింది. కమర్షియల్ సిలిండర్ ధరలైతే ఆకాశాన్ని తాకేలా పెరిగాయని అన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల తహసిల్దార్ ఇబ్రహీం కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు గంజి శివుడు, శివరాం. వానరాశి శివ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బీరప్ప స్వామి విగ్రహ ధ్వజ స్తంభ ప్రతిష్ట

**కల్వకుర్తి మే 6 (నినాదం)**

వెల్దండ మండల కేంద్రంలో కురుమల కుల దైవం బీరప్ప స్వామి కామరాతి. అక్క మహంకాళి విగ్రహ ప్రతిష్ట. ధ్వజస్తంభ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు బుధవారం. వేకువ జాము నుండి వేదమంత్రాల నడుము ప్రతిష్టాపన కార్యక్రమలను ద్విగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. ధ్వజస్తంభ దాత మాజీ ఎం.పీ.టీ.సీ సభ్యులు నెంట. లలిత తంబాలు. ఆలయ కమిటీ సభ్యులు. చిందం కృష్ణయ్య కురుమ. నెంట జంగయ్య. రాములు. సత్యనారాయణ. బడుక. రామకృష్ణ. సూద. కుమార్. కించ.కుమార్. కృష్ణ. ప్యాట. శ్రీశైలం. నెంట. పర్వతాలు. బడుక. బీరయ్య. బడుక. వెంకటయ్య. వెంకటయ్య. నెంట.భాస్కర్. గౌర రమేష్. నెంట.శివ సూద. సత్యనారాయణ. సూద. లక్ష్మయ్య. మల్లయ్య. నెంట వినయ్. యాదయ్య. కారువంగా వెంకటయ్య. కారువంగా పర్వతాలు. శివ. భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# నూతన దంపతులను ఆశీర్వదించిన యోగ సభ్యులు

**మధిర, మే 6 (నినాదం):**

మధిర మున్సిపాలిటీ శ్రీ దివ్య సాయి సేవా ట్రస్ట్ కళ్యాణమండపం నందు ఆత్మకూరు హనుమంతరావు, కృష్ణవేణి దంపతుల కుమార్తె చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి సాయి నాగరిక, చిరంజీవి భాను నాగరామ సాయి ల వివాహ వేడుకకు యోగా గురూజీ నాళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగ సభ్యులందరూ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో యోగా గురూజీ నాళ్ళ శ్రీనివాసరావు, శ్యామల రావు, పసుపులేటి శ్రీనివాసరావు, ఆర్టీసీ రాజు, తిరుపతిరావు, టీచర్ రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి, లక్ష్మి, సుకన్య, సుధా, లలిత తదితర యోగ సభ్యులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.




# ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయ పంటలు రైతులు

**ఆర్మూర్ మే 6 (నినాదం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున జిల్లా, మోర్తాడ్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో రైతులకు వచ్చే రబీ సీజన్లో ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన వ్యవసాయ ఆధునిక పద్ధతుల్లో పంటలను సాగు చేయాలని కె. వి.కే. రుద్రూర్ ప్రొఫెసర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత, ఏ.వో.హరీష్, ఏ.ఈ.ఓ. దొనకల్, ఇఫ్కో సంస్థ కె. నితిన్, డోన్కల్ సర్పంచ్ గడ్డం అనిల్, ఉప సర్పంచ్ తీగల భూమారెడ్డి, పలువురు అన్నారు. నూతన ఆధునిక వ్యవసాయ రైతుల సాగు పద్ధతి పై అవగాహన సదస్సు స్థానిక సర్పంచ్ గడ్డం అనిల్ అధ్యక్షతన దొనకల్ గ్రామంలో గల రైతు వేదిక భవనంలో గ్రామ రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు లాభదాయకమైన, శాస్త్రీయ పద్ధతులలో, ఎరువుల వాడకాన్ని తగ్గించి, ఎరువుల వాడకాన్ని పంటలకు రైతులు తగ్గించి, నేల భూసారం తగ్గకుండా చూసుకోవాలని, రైతులు సాగు చేసే పలు అంశాలపై శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులకు అవగాహన సదస్సులో వివరించారు. ఈ బి.గంగారెడ్డి, నరసారెడ్డి, తూర్పు గంగారెడ్డి, డి. ముత్యం రెడ్డి, గ్రామ రైతులు, మహిళా రైతులు, ఏఈఓ లు, తదితరులు,పాల్గొన్నారు.

# బొమ్మ శ్రీరామ్ నియమాకం పట్ల ఆకుల గాంధీ హర్షం

**ఖమ్మం, మే 6(నినాదం ):**



మున్నూరుకాపు సహకార సంస్థ (కార్పొరేషన్ లిమిటెడ్) ఛైర్మన్ గా ప్రముఖ న్యాయవాది బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని నియమించడం పట్ల మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ హర్షం వ్యక్తం చేశారు.శ్రీరామ్ తండ్రి,మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బొమ్మ వెంకటేశ్వర్లు మున్నూరుకాపులతో పాటు బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం, సముద్ధరణకు విశేష కృషి చేశారని,ఆయనతో తనకు సన్నిహిత సంబంధాలు ఉండేవని గాంధీ గుర్తు చేసుకున్నారు.న్యాయవాదిగా,రాజకీయ నాయకుడిగా,మున్నూరుకాపు సంఘం ప్రముఖుడిగా శ్రీరామ్ అందిస్తున్న విస్తృత సేవలకు గుర్తింపుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయన్ను ఛైర్మన్ గా నియమించారని గాంధీ పేర్కొన్నారు.ఇదేవిధంగా శ్రీరామ్ మున్నూరుకాపులతో పాటుగా పేద ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి కృషి సల్పుతూ ప్రజా జీవితంలో మరింత గొప్పగా ఎదగాలని ఆకుల గాంధీ ఆకాంక్షిస్తూ,ఆయనకు,వైస్ ఛైర్మన్ గా నియమితులైన అల్లం భాస్కర్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# పెండింగ్ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు

**ప్రజలకు సమయానికి సేవలు అందించాలి: కలెక్టర్ దివాకర టీఎస్**

**సాదా బైనామా, భూ భారతీ, మీ సేవా దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**






**ఖమ్మం ప్రతినిధి, మే 06 (నినాదం )**

రెవెన్యూ శాఖలో పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు సమయానికి సేవలు అందించాలంటూ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు.సాదా బైనామా దరఖాస్తులపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, జారీ చేసిన నోటీసులు, నిర్వహించిన ఫీల్డ్ ఎన్క్వైరీలు, గుర్తించిన అర్హులు, ఆర్డీవోకు పంపిన దరఖాస్తుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. 2014 జూన్ 2కు ముందు జరిగిన లావాదేవీలకే ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ భూమి ఒక్క అంగుళం కూడా రెగ్యులరైజ్ చేయరాదని స్పష్టం చేశారు. భూమి యాజమాన్యం మార్పులకు సరైన ఆధారాలు తప్పని సరిగా ఉండాలని హెచ్చరించారు. భూ భారతీ స్లాట్లపై సమీక్షిస్తూ, రిజిస్ట్రేషన్ ఆలస్యాలకు కారణాలు నమోదు చేసి నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సమయానికి రిజిస్ట్రేషన్ చేయని స్లాట్లు రద్దు అవుతాయని ముందస్తుగా తెలియజేయాలని ఆదేశించారు. ప్రతి రోజు మూడు మండలాల నుంచి క్లియర్ చేసిన ఫైళ్లను జిల్లా స్థాయికి పంపించా లని చెప్పారు.మీ సేవా దరఖాస్తుల విషయంలో పెండెన్సీకి ఎలాంటి అవకాశం ఉండకూడదని కలెక్టర్ హెచ్చరించారు. తదుపరి సమీక్ష నాటికి ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను మార్గదర్శకాల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రతి మండలంలో లభ్యమయ్యే ప్రభుత్వ భూములపై సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. భూములను విభాగాల వారీగా వర్గీకరించి, రహదారి సౌకర్యం ఉన్నవి, లేనివి అని స్పష్టంగా చూపించాలని తెలిపారు.ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్ మ్యాపింగ్‌ను కచ్చితంగా నిర్వహించాలని, ఒకే ఓటరు రెండు చోట్ల నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 'మన ఇసుక వాహనం' విధానం ద్వారా ప్రజలకు తక్కువ ధరలో ఇసుక అందుబాటులో ఉంటుందని తెలిపారు.ప్రజావాణి వినతులపై స్పందిస్తూ, ప్రతి వినతిని 15 రోజుల్లోగా పరిష్కరించాలని, ఆలస్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి చర్యల నివేదికలను అప్లోడ్ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీవో, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# రైతులకు తాగునీటి వసతి కల్పించాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచన**

**వనపర్తి ప్రతినిధి, మే 6 (నినాదం)**

వరి కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు తాగు నీరు, కనీస మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం చిట్యాల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన అంబలి, తాగు నీరు కేంద్రాన్ని వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్ గౌడ్, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్ తో కలిసి ఆయన ప్రారంభించారు.వచ్చిన రైతులకు రాగి అంబలి, మంచి నీరును అందించారు. మిగిలిన అన్ని కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లోనూ రైతులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



# మోదీ సభకు భారీ జన సమీకరణపై బీజేపీ ఫోకస్

**కరీంనగర్ నుంచి వెయ్యి కార్లు, 250 బస్సులతో వేలాది మందిని తరలించే ప్రణాళిక**

**రేపటి నుండి సికింద్రాబాద్ లో మకాం వేయనున్న కేంద్ర మంత్రి**

**ఎల్లుండి బైక్ ర్యాలీ, పాదయాత్రతో ఇంటింటికీ వెళ్లి సభకు ఆహ్వానించేలా ప్రణాళిక**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**

**కరీంనగర్, మే 6 (నినాదం )**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 10న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభను బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ జన సమీకరణకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయి.కరీంనగర్ పార్లమెంట్ పరిధి నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. గత నాలుగు రోజులుగా కరీంనగర్‌లో మకాం వేసి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. గ్రామాలు, మండలాలు, మున్సిపల్ వార్డుల వారీగా లక్ష్యాలు నిర్దేశించి, ఇన్‌చార్జీలను నియమించారు. నేతల నుండి సేకరించిన వివరాల ప్రకారం కరీంనగర్ పరిధి నుంచి సుమారు వెయ్యి కార్లు, 250 బస్సులు ఏర్పాటు చేసి వేలాది మందిని సభకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించారు. స్వచ్ఛందంగా వచ్చే ప్రజలకు రవాణా, తాగునీరు, భోజన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇక రేపటి నుంచి బండి సంజయ్ సికింద్రాబాద్‌లో మకాం వేసి నగరంపై దృష్టి పెట్టనున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ నేతలతో ఉదయం సమావేశం, సాయంత్రం ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం బైక్ ర్యాలీ, పాదయాత్రల ద్వారా ఇంటింటికీ వెళ్లి సభకు ఆహ్వానించే కార్యక్రమాలు చేపట్టనున్నారు. మహిళా మోర్చా కార్యకర్తలు కూడా తమ ప్రాంతాల్లో ప్రజలను ఆహ్వానించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణా రెడ్డి, ఉప మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ ఉప మేయర్ గుగ్గిళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం, రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**ఇందిరమ్మ ఇండ్లతో ప్రతి అర్హుడికి గృహ కల్పన లక్ష్యం: పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ప్రజల వద్దకే పాలన – ప్రజాదర్బార్ ద్వారా సమస్యల పరిష్కారం.. గువ్వల గూడెం ప్రజాదర్బార్ లో పాల్గొన్న మంత్రి**

**ఖమ్మం ప్రతినిధి, మే 6 (నినాదం )**







పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం నేలకొండపల్లి మండలం గువ్వల గూడెం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల దీవెనలతో ఏర్పడిన ప్రజాప్రభుత్వం గడచిన రెండు సంవత్సరాల నాలుగు నెలల కాలంలో పేద ప్రజలకు అండగా ఉంటూ, పేదల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. రైతు సంక్షేమంలో ఎక్కడ తగ్గకుండా, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన చేయడంలో దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే అధికంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా, ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలోనే ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజల వద్దకు పంపి ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరించామని అన్నారు.దొరల పాలనలో లక్ష రూపాయల రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తే, తమ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని, గత పాలకులు వరి వేస్తే ఉరి వేసినట్లే అని బెదిరిస్తే, తమ ప్రభుత్వం పూర్తి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు సన్న వడ్లకు క్వింటాల్‌కు 500 రూపాయలు చెల్లించామని అన్నారు.రైతు భరోసా క్రింద ఎకరానికి 12 వేలు పంట సహాయం అందిస్తున్నామని అన్నారు. ప్రస్తుత సంవత్సరం భారీ ఎత్తున వడ్లు, మొక్కజొన్న పంట పండినప్పటికీ ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని మంత్రి స్పష్టంచేశారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద ఇప్పటికే పెద్ద ఎత్తున ఇండ్లు మంజూరు చేశామని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇండ్లు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మే నెలాఖరికి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, వేల సంఖ్యలో దరఖాస్తులు అందాయని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం అధిక దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ధరణి కారణంగా వచ్చిన భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరిస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను అర్హత మేరకు త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. రాబోయే 35 రోజులలో సాదా బైనమా దరఖాస్తులు అర్హత మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా దర్బార్ లో వచ్చిన న్యాయబద్ధమైన ప్రతి దరఖాస్తుకు గరిష్టంగా మూడు నెలలలో పరిష్కారం చూపుతామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ప్రజాదర్బార్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గువ్వలగూడెం గ్రామంకు చెందిన ఒంగోలు ఉష మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన తాను ఎంతో ఆనందంగా ఉన్నానన్నారు. గత 10 సంవత్సరాల్లో ఇంత మంచి కార్యక్రమం జరగలేదని, ప్రభుత్వం చేసిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిందని తెలిపారు. తమ గ్రామానికి ఇందిరమ్మ పథకం క్రింద 35 ఇళ్లు మంజూరు కావడం సంతోషకరమని, గతంలో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకు ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో సంతోషంగా ఉన్నానని, ఇందిరమ్మ ఇళ్లు పొందిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు. నేలకొండపల్లి లబ్ధిదారు గుడిపూడి నాగమణి మాట్లాడుతూ.. గతంలో ప్రయాణాలకు ఛార్జీలు ఉండేవని, ఇప్పుడు ఉచిత ప్రయాణం, సన్న బియ్యం లభించడం వల్ల సంతోషంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లను పేదలందరికీ అందిస్తూ ఇది నిజంగా పేదల ప్రభుత్వం అని నిరూపించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**భూపాలపల్లి ప్రతినిధి, మే 06(నినాదం):**

పెండింగ్ ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మున్సిపల్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీవో లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగం పెంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. కొన్ని చోట్ల లబ్ధిదారులు మంజూరు పత్రాలు అందుకుని ఇంటి నిర్మాణాలకు పునాది వేసిన వారికి అవగాహన కల్పించి వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆన్లైన్ లో సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పైలెట్ గ్రామాలలో పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణం అవుతున్న ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేసేందుకు ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పంచాయతీ సెక్రటరీలు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం కలెక్టర్ భూ భారతి, సాదా బైనామా, బల్క్ భూ సమస్యలు తదితర అంశాలపై అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతీలో అందిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అలాగే సాదాబైనామల సమస్యలను కూడా జాప్యం చేయకుండా పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలక అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, హౌసింగ్ ఏ.ఈ శ్రీకాంత్, అన్ని మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్ ఏ.ఈ లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ బలోపేతం చేయాలి

**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు.. ఐ టి ఇ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం**

**పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**కల్వకుర్తి మే 6 (నినాదం)**






పెద్దపల్లి జిల్లా మంథనిలో తెలంగాణ ప్రభుత్వం ఐటీఈ శాఖ ఆధ్వర్యంలో టాస్క్ మరియు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఘనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా. ఐటీ,పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్థానిక ఎంపి గడ్డం వంశీ కృష్ణ జిల్లా కలెక్టర్ కోయ హర్ష మరియు టాస్క్ సి.ఇ.ఓ నితిన్ కుమార్ రెడ్డి టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్‌ను మరింత బలోపేతం చేసి, యువతను భవిష్యత్ టెక్నాలజీలకు సిద్ధం చేయాలనే దిశగా ఈ కేంద్రం ఏర్పాటు చేయబడిందని,రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుండగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క యువతకు ఉపాధి,స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు,ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ,సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా యువతకు ఇండస్ట్రీకి అనుగుణమైన స్కిల్ ఆధారిత శిక్షణ,ఆధునిక ప్రాక్టీస్ టెక్నాలజీ ట్రైనింగ్,రియల్ టైమ్ ప్రాజెక్టులపై పని చేసే అవకాశాలు, ప్రముఖ సంస్థలతో కలసి ప్లేస్మెంట్ సపోర్ట్, డేటా సెంటర్ టెక్నాలజీలపై ప్రత్యేక అవగాహన అందుబాటులోకి రానున్నాయని, టాస్క్ మరియు కంట్రోల్ ఎస్ సంస్థల భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ కేంద్రం విద్యార్థులు మరియు నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలకు వేదికగా మారనుందనీ, ముఖ్యంగా మారు తున్న టెక్నాలజీ అవసరాలకు అనుగుణంగ యువ తను తీర్చిదిద్దడంలో ఈ సి ఓ ఈ కీలక పాత్ర పోషించనుంది అని,ప్రస్తుతం ప్రపంచం వేగంగా మరియు ఆధునిక టెక్నాలజీల వైపు దూసుకెళ్తోంది,ఇలాంటి సమయంలో యువతకు సరైన నైపుణ్యాలు అందించడం అత్యంత అవసరం,టాస్క్ ద్వారా అందిస్తున్న ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ యువతకు ప్రాక్టికల్ నాలెడ్జ్, ఇండస్ట్రీ అనుభవం అందించి, వారిని ఉద్యోగాలకు సిద్ధం చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల యువత ఈ గొప్ప అవకాశాలను వినియోగించుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రదినిధుల, నాయకులతో పాటు, టాస్క్ సభ్యులు బృందం తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారం చేస్తాం

**కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్**

**కోరుట్ల, మే 6 (నినాదం)**





తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇల్లు లేని ప్రతి ఒక్కరూ సొంతింటి నిర్మాణం చేపట్టుకోవాలని సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్నామని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ అన్నారు. ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ ద్వారా కోరుట్ల పట్టణ 14వ వార్డు చెందిన గుండేటి మేఘన రమేష్ 13వ వాడుకు చెందిన బైరి శారద గంగాధర్, 18వ వార్డుకు చెందిన దాసరి లక్ష్మి లు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టుకొని బుధవారం ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశ వేడుకలు చేపట్టారు. ఈ వేడుకలకు స్థానిక అవార్డు కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ హాజరై నూతన గృహప్రవేశ లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశల కృషి చేస్తూ ఇల్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ పత్రాల అందిస్తున్నామని అన్నారు. ప్రొసీడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని ఇంటి నిర్మాణం ఏ విధంగా జరిగితే ఆ విధంగా ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బులు జమవుతా యన్నారు. ప్రొసీడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ కూడా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం త్వరగా చేపట్టుకోవాలని సూచించారు. అలాగే ఇంకా ఎవరైనా ఇల్లు రానివారు అర్హులు ఉంటే త్వరలోనే వారందరికీ కూడా అందజేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ తో పాటు రేంజర్ల కళ్యాణి దండవేణి వెంకటేష్ రహీం ధనని లక్ష్మణ్ రహీం నూతన ఇందిర మా ఇంటి గృహ ప్రవేశ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు రాజు కావాలంటే... లాభసాటి పంటలు

# ప్రభుత్వ చేయుతపై అవగాహన ఉండాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి**

**గోపాల్ పేట, మే 6 (నినాదం)**





రైతులు ఒకే రకమైన పంట కాకుండా తరచుగా పంట మార్పిడి, భూసారం, ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న సహకారంపై రైతుకు పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే రైతు మంచి లాభాలు పొందుతూ రాజుగా ఉంటాడని, లేకుంటే కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగ గోపాల్ పేట మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో గోపాల్ పేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు జిల్లాలో రైతు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, రైతు అనుబంధ శాఖలు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో రైతులకు పంట సాగుపై మెళుకువలు, పంట మార్పిడి వల్ల లాభాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, బ్యాంకు ఋణాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. రైతులకు భూ ఆరోగ్య కార్డు (సాయిల్ హెల్త్ కార్డ్) ఇవ్వడం జరుగుతుందని, శాస్త్రజ్ఞులు రైతు పొలాన్ని పరిశీలించి భూమిలో ఉన్న సారం, భూమిలో నత్రజని, పోటాష్, భాస్వరం తదితర ఏ ధాతువు తక్కువ అయ్యింది, ఏది ఎక్కువ అయ్యింది అనేదానిపై అధ్యయనం చేసి అట్టి పొలంలో ఎలాంటి పంటలు వేసుకోవాలి, ఎలాంటి ఎరువులు ఎంత మోతాదులో వేయాలి అనే అంశాలను సాయిల్ హెల్త్ కార్డు ద్వారా రైతులకు తెలియపరచడం జరుగుతుందని తెలిపారు. అందువల్ల జిల్లాలోని రైతులు అందరూ సాయిల్ హెల్త్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మోతాదుకు మించి యూరియా వాడటం వల్ల తాత్కాలికంగా మొక్కలు పచ్చగా, ఏపుగా కనిపిస్తుంది కానీ ముద్దగా ఏర్పడి పంట దిగుబడి, నాణ్యత తగ్గిపోతుందని తెలియజేశారు. అదేవిధంగా కిసాన్ క్రెడిట్ కార్డు ప్రతి రైతు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులో రైతులకు కేవలం 7–9 శాతం వడ్డీతో రుణాలు అందిస్తాయని, వాటిని సకాలంలో తిరిగి చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం ద్వారా 3 శాతం వడ్డీని తిరిగి రైతుకు చెల్లిస్తుందని చెప్పారు. ప్రతిసారి ఒకే రకమైన పంట వేయడం వల్ల భూమి సారం కోల్పోయి దిగుబడి తగ్గిపోతుందని, అందువల్ల తరచుగా పంట మార్పిడి చేస్తూ ఉంటేనే భూమి సారవంతంగా ఉండి మంచి దిగుబడి ఇస్తుందన్నారు. భావితరాలకు సైతం మంచి సారవంతమైన భూమిని అందించాల్సిన బాధ్యత అందరూ రైతులపై ఉందన్నారు. అందువల్ల కేవలం వరి పంట సాగు మాత్రమే కాకుండా వేరు సెనగ, పామాయిల్, కూరగాయలు తదితర వాణిజ్య పంటలు సాగుచేసుకొని రైతులు లాభాలు పొందాలని సూచించారు. జిల్లాలో గన్ని బ్యాగుల కొరత రానివ్వబోమని, పశ్చిమ బెంగాల్లో ఎన్నికలు, పశ్చిమాసియాలో యుద్ధాల వల్ల గన్ని బ్యాగుల సరఫరాలో కొంత జాప్యం జరిగిందని, దీనిని త్వరలో అధిగమించడం జరుగుతుందన్నారు. రేవల్లి మండలానికి 10 వేల గన్ని బ్యాగులు పంపించడం జరుగుతుందని, మిగిలిన మండలాలకు సైతం కొరత లేకుండా చేసి వరి, మొక్క జొన్న ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో గోపాల్ పేట పి.ఎ.సి.ఎస్ మాజీ చైర్మన్ ఎల్.రఘు, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద రావు, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి బి.రాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, నాబార్డ్ డి.యం.మనోహర్ రెడ్డి, ఎల్.డి.యం శివకుమార్ రైతులకు వ్యవసాయ సాగు, రుణాలపై అవగాహన కల్పించారు. తహసిల్దార్ తిలక్, ఎంపీ.డి.ఒ, గోపాల్ పేట, రేవల్లి, ఏదుల గ్రామాల సర్పంచులు, మండల వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి

**ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పి**

**నల్లగొండ ప్రతినిధి మే 6 (నినాదం):**



రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్ రైతు వేదికలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు కు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేకించి ఆయా భూములకు అనుకూలంగా ఉండే పంటలు పండిస్తే అధిక దిగుబడులతోపాటు, అధిక లాభాలు సాధించవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను మంజూరు చేసే ప్రక్రియను ప్రారంభించిందని, ఆయా గ్రామాలలోని భూములకు అనుగుణంగా పంటలు వేసేందుకు జిల్లా యంత్రాంగం తరుపున అవసరమైతే ఒక డ్రైవ్ లా భూముల సారవంతం పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. పండిన పంటకు పూర్తిస్థాయిలో లాభం వచ్చినప్పుడే రైతు అలాంటి పంటల వైపు మొగ్గు చూపుతాడని, మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంటుందని అన్నారు. రైతులు ఒకే పంటను పండించకుండా అన్ని రకాల పంటలు పండించాలని, ప్రస్తుత వ్యవసాయ పద్ధతులు, కొత్తగా వస్తున్న మార్పులపై దృష్టి సారించి మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా పంటలు పండించాలని చెప్పారు. ముఖ్యంగా పంటల సాగుతో పాటు, పండించిన పంటల ద్వారా అధిక లాభాలు పొందేందుకు ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్ వంటి సౌకర్యాలు వినియోగించుకొని పంటలు నిల్వ చేసుకోవడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చని అన్నారు. వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. వరిలో ఎల్లప్పుడూ దొడ్డు బియ్యం కాకుండా, డిమాండ్ ఉన్న సన్న బియ్యం ఇతర రకాల ధాన్యాన్ని పండించాలని రైతులకు సూచించారు. రైతు సంక్షేమంలో భాగంగా తిప్పర్తి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఉన్న భూమిని రైస్ మిల్ ఏర్పాటు చేసేందుకు సుముఖ వ్యక్తం చేసిన నేపథ్యంలో నాబార్డ్. అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఇచ్చే రుణాలకు ఎలాంటి పాస్ పుస్తకాలు లేకుండా ఆన్లైన్లో భూభారతి వివరాల ఆధారంగా లోన్లు మంజూరు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సి ఈ ఓ ను ఆదేశించారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పిఏసిఎస్ అధ్యక్షులు నాగరత్నరాజు, సహదేవరెడ్డి, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, ఎల్డిఎం శ్రామిక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ పాల్గొన్నారు.

# మమతా బెనర్జీ అహంకారం !

సంపాదకీయం

ప్రజాస్వామ్యంలో నిరంకుశంగా ఉంటామంటే కుదరదు. ప్రజలు ఎన్నుకుంటే నేతలు..లేదంటే అంతే సంగతులు. భారత ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజ్యాంగ బద్ధంగా ఉండాల్సిందే. కాదూ కూడదంటే... కుదరదు. ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి..ఫలితాలు కూడా వచ్చేశాయి, బెంగాల్లో బిజెపి అధికారం చేపట్టబోతోంది. తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీ అధికారం దక్కించు కుంది. ఇంతవరకు ఇవే పెద్ద మార్పులు. కేరళలో ఎల్‌డిఎఫ్ స్థానంలో య డిఎఫ్ అధికారం కైవసం చేసుకుంది. అసోం, పాండిచ్చేరిల్లో పాత ప్రభుత్వాలే కొత్తగా కొలువుదీర బోతున్నాయి. ఈ క్రమంలో బెంగాల్లో గత పదేహేనేళ్ల మమతా బెనర్జీ పాలనలో అనేక అరాచకాలను చూశాం. తానూ బంగ్లాదేశ్‌లో లాగా ఓ దేశానికి రాణిని అని భ్రమిశారు. అడ్డూ అదుపులేకుండా ఆరాచకాలకు తెలేపారు. చొరబాటుదార్లకు గేట్లు తెరిచారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇచ్చి వారిని పర్మినెంట్‌గా ఓటర్లను చేశారు. కానీ సర్ ప్రక్రియతో ఆమె ఆటలు సాగలేదు. అలాగే ఆమె తీరుతో ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓట్ల రూపంలో తమ తీర్పును తెలిపారు. 95 శాతం మంది, అందులో మహిళల క్యూలు కట్టి మమతను ఓడించారు. ప్రజల తీర్పును గౌరవించాల్సిన మమతా బెనర్జీ తాను ఓడిపోలేదని, రాజీనామా చేయలనని, బిజెపి వందసీట్లు చోరీ చేసిందని దగుల్బాజీ మాటలు మాట్లాడారు. అసోం, బెంగాల్లో ఓట్ చోరీ జరిగిందని రాహుల్ కూడ వంతపాడారు. మరి తమిళ నాడు, కేరళలో ఓట్ చోరీ ఎదుకు జరగలేదో రాహుల్ చెప్పాలి. రాహుల్ ఓట్ చోరీ పేరుతో ఇంకా నాటకాలు ఆడితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. విపక్షనేత కూడా మతిభ్రమించి మాట్లాడడం అలవాటు చేసుకున్నారు. మమత బెనర్జీ తాను ఇండియాలో ఉన్న వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశానని అనుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లాగా తనది కూడా స్వతంత్ర రాజ్యం అనుకుంటున్నారు. అందుకే రాజ్యంగం విలువ తెలియకుండా మాట్లాడుతున్నారు .ఆ రాజ్యంగమే ఆమెను 15 ఏళ్లపాటు సిఎంగా మోసిందని గుర్తించడం లేదు. ఓటమితో మమతలో అసహనం పెరిగింది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. రాహుల్ ఓట్‌చోరీని సీట్ల చోరీతో పోల్చి మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని మమతా బెనర్జీ అంటున్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి వి□డియా సమావేశంలో మంగళవారం నాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. రాజీనామా చేయకుంటే బర్తరఫ్ చేస్తారని అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ గట్టిగానే హెచ్చరించారు. 15 ఏళ్లపాటు ఇవిఎంలతోనే మమత గెలిచారు. ఇప్పుడేమో ..ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహ రించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీచేశారని ఆరోపించడం చూస్తే మతి భ్రమించిందనే అనుకోవాలి. ఉద్దేశ్య పూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడిం చారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని కూడా చెప్పుకొచ్చారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోప ణలు చేశారు. ఎసఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించా రనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తు గడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. నిజానికి గతంలో మమతా బెనర్జీ పకడ్బందీగా ఇవన్నీ చేశారు. మమతను సుప్రీం కూడా చీవాట్లు పెట్టింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఆమెను 15 ఏళ్లు భరించడమే ఎక్కువ. ఇలాంటి నేతలు ఉన్నందుకు సిగ్గుపడాలి. ఉమ్మడిగా పోరాటం కోసం తాను 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు. అందుకేనేమో రాహుల్ కూడా ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. కేరళ, తమిళనాడు తప్ప అంతా ఓట్ చోరీ జరిగిందని పాత ఆవుకథను మళ్లీ పదేపదే చెప్పారు. నిజానికి పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రా్ల్లో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు. దేశంలో ఎక్కడా ఉనికిని పెంచుకోలేక పోయిన కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు కొత్త ఊరటనిచ్చేదిగా ఉంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఓడి పోవడం అన్నది క ఊడా ప్రజలు కోరుకున్న మార్పులో భాగమే. అంతే తప్ప కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు. ఇకపోతే తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. మరి ఇక్కడ బిజెపి ఓటు చోరీ చేయలేకనా అన్నది మమతా బెనర్జీ చెప్పాలి. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బిజెపి ఎంతగా పాకులాడినా తమిళనాట ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరించారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగ పెట్టుకుంది. ఇవన్నీ మరచిన మమత తానేదో పునీతురాలినని చెప్పుకోవడం, సిఎంగా రాజీనామా చేయనని ప్రకటించుకోవడం అహంకారంతో కూడిన అవివేకానికి నిదర్శనం. అలా చేస్తే బర్తరఫ్ చేయడం తప్ప మరోమార్గం ఉండదు.

# విశ్వకవి ఠాగూర్ బోధనలు సార్వజనీనాలు

(07 మే "రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి" శుభ సందర్భంగా)

భారతదేశానికి జాతీయ గీతం అందించిన ప్రసిద్ధ కవి, బహుముఖ ప్రజ్ఞాశాలి రవీంద్రనాథ్ ఠాగూర్. రవీంద్రుడు రచించిన గీతాంజలి కావ్యానికి 1913లో సాహిత్యంలో నోబెల్ బహుమతిని పొందిన తొలి ఆసియావాసిగా ఖ్యాతి చెందారు. కవి, నవలాకర్త, రచయిత, నాటకకర్తో, వ్యాసకర్త, కథా రచయిత, సంగీత కర్త, తత్వవేత్త, సంఘ సంస్కర్త, విద్యావేత్త, భాషాలేత్త, వ్యాకరణ పండితుడు, చిత్రకారుడు అయిన రవీంద్రనాథ్ ఠాగూర్ 07 మే1861 రోజు పిరలీ బ్రాహ్మణ కుటుంబంలో దేవేంద్రనాథ ఠాగూర్ – శారదాదేవి పుణ్య దంపతులకు జన్మించారు. బాల్యంలో ఇంటి నాలుగు గోడల మధ్య గడిపిన రవీంద్రనాథ్ ఠాగూర్‌కు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. పాఠశాలకు వెళ్లడం ఇష్టపడక ఇంటి వద్దనే క్రమశిక్షణతో వ్యాయామం, గణితం, చరిత్ర, భూగోళ పాఠాలు, చిత్రలేఖనం, ఆటలు, ఆంగ్లం, సంగీతం, భౌతిక శాస్త్రం, సంస్కృతి వ్యాకరణం, ఆంగ్ల సాహిత్యం చదవడం, మాతృభాషపై పట్టు సాధించడం లాంటి పలు క్రియలను ఏకకాలంలో కొనసాగించారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ :**

రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లాండ్ వెళ్లి పబ్లిక్ స్కూళ్లలో చేరి ఆచార్యుల బోధనలు విని ఆంగ్ల సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. అక్కడ ఉండగానే "భగ్న హృదయం' అనే కావ్యాన్ని రచించారు. ఇంగ్లాండ్‌లో ఏడాదిన్నర పాటు ఉన్నప్పటికీ ఎలాంటి డిగ్రీ పొందకుండానే మాతృభూమికి తిరిగి వచ్చారు. 1883లో మృణాళిని దేవిని వివాహమాడిన రవీంద్రనాథ్ ఠాగూర్ బాల్యంలోనే పలు పద్యాలు, వ్యాసాలు, విమర్శలు రచించి ప్రచురించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల్లో బెంగాలీ భాషలో రచించిన భక్తిగీతాల సంపుటి గీతాంజలి అతి గొప్పది, నోబెల్ పురస్కారం పొందిన తొలి భారతీయ రచనగా నిలిచింది. 1901లో బాలల మనో వికాసం కోరిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ దిశగా ఐదుగురు విద్యార్థులతో "శాంతినికేతన్ విశ్వ భారతి గురుకుల విశ్వవిద్యాలయాన్ని" స్థాపించారు. అదే క్రమంలో 1919లో కళా భవన్ స్థాపించా విభిన్న కళలను నేర్పించడం, తానే స్వయంగా నేర్చుకున్నారు. 'ప్రతిభ', 'ప్రకృతి – వికృతి' లాంటి పలు నాటకాలు చరించారు. అదే విధంగా 'గోరా' లాంటి ప్రఖ్యాత నవలలు రచిస్తూనే చిత్రకళ, సంగీత శాస్త్రంలో సాధన చేశారు.

**జాతీయ గీత సృష్టికర్త విశ్వకవి ఠాగూర్:**

చిన్నపాటి నుంచే జాతీయ భావాలను పునికిపుచ్చుకున్న రవీంద్రనాథ్ ఠాగూర్ దేశభక్తి గీతాలను ఆలాపించేందుకు ఇష్టపడే వారు. 1896లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సదస్సులో తొలిసారి బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం' గీతాన్ని ఠాగూర్ ఆలపించారు. 1950 జనవరి 24 రోజున నాటి భారత రాజ్యాంగ సభ కమిటీ రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'జనగణమనా'ను జాతీయ గీతంగా, బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం'ను జాతీయ గేయంగా ప్రకటించారు. మనం ఆరాధించే దేవుడు రైతు, శ్రామికుడి రూపంలో ఉన్నాడని బోధించిన ఠాగూర్ సృజనశీల ఆలోచనలు అన్ని కాలాలకు అనువైనవిగా పేరు తెచ్చుకున్నాయి. తన సుదీర్ఘ జీవితంలో 2,000లకు పైగా పాటలు రచించారు. అణగారిన వర్గాల పక్షపాతి అయిన ఠాగూర్ శాంతి, సామరస్యాల వంటి సార్వత్రిక విలువల స్థాపనకు కృషి చేశారు.

2వ ప్రపంచ యుద్ధం మిగిల్చిన విధ్వంసాలకు చలించిన రవీంద్రనాథ్ ఠాగూర్ మానసికంగా కుంగిపోయి అనారోగ్యానికి గురి అయ్యారు. వ్యాధి తీవ్రత పెరగడంతో 07 ఆగష్టు 1941న తుది శ్వాస విడిచారు. "గురుదేవ్", "విశ్వకవి" పేర్లతో ముద్దుగా పిలుచుకునే రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీత సృష్టికర్తగా భారతీయుల మదిలో నిలిచిపోయారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన రవీంద్రనాథ్ ఠాగూర్ దార్శనికుడికి హృదయపూర్వకంగా నివాళుల అర్పిద్దాం, ఆయన చూపిన బాటన నిలిచే ప్రయత్నాలు చేద్దాం.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి 9949700037**

# టివికె విజయ్‌కు తమిళ కాంగ్రెస్ మద్దతు



**ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జ్ గిరీశ్ చోడంకర్ ప్రకటన**

**తిరుచ్చిఒ సీటును వదులుకో బోతున్న విజయ్**

**ఆ స్థానంలో త్రిష పోటీ అంటూ సోషల్ మీడియా కూత**

చెన్నై:

తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు టీవీకే పార్టీకి కాంగ్రెస్ అధికారిక మద్దతు ప్రకటించింది. బేషనరతుగానే ఈ మద్దుతును తెలిపింది. విజయ్ కోరకముందే కాంగ్రెస్ నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యంగా ఉంది. ఎక్కడ అన్నడిఎంకెను కలుపుకుంటారో అన్న భయం కాంగ్రెస్‌లో ఉంది. అందుకే విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతు తెలుపుతూ ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జ్ గిరీశ్ చోడంకర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. మతతత్వ శక్తులను కూటమిగా దూరంగా ఉంచాలనే ప్రధాన లక్ష్యం తోనే ఈ మద్దతు ఇస్తున్నట్లు గిరీశ్ చోడంకర్ వెల్లడించారు. తమిళనాడులో లౌకిక, అభ్యుదయ, సంక్షేమ ప్రభుత్వాన్ని అందించడమే తమిళనాడు ప్రజల తీర్పు ఉద్దేశమని గిరీశ్ వ్యాఖ్యానించారు. కేవలం ప్రభుత్వ ఏర్పాటుకే కాకుండా భవిష్యత్తులో జరగబోయే స్థానిక సంస్థలు, లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికల్లోనూ టీవీకేతో కలిసి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో తమిళనాడులో కొత్త రాజకీయ సవికరణాలకు కాంగ్రెస్` టీవీకే పొత్తు తెరలేపినట్లు అయ్యింది. తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతు అందించాలని భారత జాతీయ కాంగ్రెస్‌ను అధికారికంగా కోరారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో టీవీకేకి తమ పూర్తి మద్దతు అందించాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ, కాంగ్రెస్ శాసనసభ పక్షం నిర్ణయించాయి. భారత రాజ్యాంగంపై విశ్వాసం లేని ఏ మతతత్వ శక్తులను కూడా ఈ కూటమిలో చేర్చుకోకుండా టీవీకే దూరంగా ఉంచాలి. ఈ షరతుపైనే మా మద్దతు ఆధారపడి ఉంటుంది. రాబోయే సంవత్సరాల్లోనూ, దశాబ్దాల్లోనూ పెరియార్ సామాజిక న్యాయ ఆదర్శాలకు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ ఆదర్శాలకు దృఢమైన నిబద్ధతతో కట్టుబడి ఉంటాం. తమిళనాడులో పెరుంతలైవార్ కామరాజ్ హయాం నాటి రోజులను తిరిగి తీసుకు రావడానికి టీవీకే, తమిళనాడు కాంగ్రెస్ మధ్య ఏర్పడిన ఈ కూటమి కృషి చేస్తుంది' అని ప్రకటనలో కాంగ్రెస్ ప్రస్తావించింది. ఇకపోతే టివికె గురువారం ప్రభుత్వ పగ్గాలు చేపట్టనుంది. ఈ క్రమంలో టాలీవుడ్, కోలీవుడ్‌లో గ్లామర్‌కు ప్రతీకగా నిలిచిన త్రిషా కృష్ణన్ రాజకీయ రంగప్రవేశం చేయబోతుందా? ప్రస్తుతం తమిళ రాజకీయాల్లో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. టీవీకే అధినేత విజయ్ తీసుకోబోతున్న నిర్ణయాలు, జరుగుతున్న అంతర్గత చర్చలు ఈ ఊహాగానాలకు మరింత ఊపునిస్తున్నాయి. అద్భుతమైన రాజకీయ అరంగేట్రంతో తిరుచిరాపల్లి(తిరుచ్చి) ఈస్ట్, పెరంబూర్ నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించిన విజయ్.. ఇప్పుడు ఒకచోట రాజీనామా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆయన తిరుచ్చి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేసి, పెరంబూర్ నియోజకవర్గాన్ని అట్టిపెట్టుకోనున్నట్టు తెలుస్తోంది. ఖాళీఅయ్యే ఆ స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలన్న దానిపై టీవీకేలో చర్చలు జోరందుకున్నాయి. అంతకంటే ముఖ్యంగా సోషల్ వి□డియాలో పెద్ద డిబేట్సే నడుస్తున్నాయి. టీవీకే ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియదు గానీ.. సోషల్ వి□డియాలో నెటిజన్లు మాత్రం బైపోల్ టికెట్ త్రిషకే అని కమిట్ అయిపోతున్నారు. సీఎం అవుతానంటూ గతంలో త్రిష కామెంట్స్ చేయడం.. ఇప్పుడు త్రిష రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లుగా చెబుతున్న విజయ్ పార్టీ టీవీకే గెలుపొందడం.. విజయ్ పోటీ చేసిన రెండింటిలో ఒక చోట బైపోల్ వచ్చే అవకాశం ఉండటం.. వెరసి పరిస్థితులన్నీ త్రిష తన కలను నెరవేర్చుకునేందుకు సహకరిస్తున్నాయా? అని నెట్టింట పెద్ద చర్చే నడుస్తోంది. ప్రస్తుతానికి త్రిష తాను కలగన్నట్లుగా సీఎం అయ్యే అవకాశం లేదుగానీ.. విజయ్ తిరుచ్చి స్థానానికి రాజీనామా చేస్తే మాత్రం.. ఆ స్థానాన్ని త్రిషకు ఇస్తారని.. ఆమెను గెలిపించుకుని ప్రభుత్వంలో కీలక పోస్ట్ ఇస్తారనే ప్రచారమైతే జోరుగా సాగుతోంది. మొత్తంగా.. త్రిష నిజంగానే ఎన్నికల బరిలోకి దిగుతుందా? టీవీకే ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తుందా? లేక ఇవన్నీ కేవలం ఊహాగానాలు గానే మిగిలిపోతాయా? అన్నది తేలాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

## 118 మంది ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి

**మద్దతు ఇచ్చే పార్టీల లేఖలు అవసరమని సూచన**
**పూర్తి మెజార్టీ ఉంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం**
**గవర్నర్ విశ్వనాథ్‌తో భేటీలో విజయ్‌కు స్పష్టీకరణ**
**నేటి ప్రమాణ స్వీకారంపై సందిగ్ధత**

చెన్నె : టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పించాలని, అప్పుడే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే`4, ఐయ□ఎంఎల్`2, సీపీఐ`2, సీపీఎం`2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్గేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నెలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవీకే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

**బత్తిన కుటుంబ సభ్యుల ప్రకటన**

హైదరాబాద్ :

ఆస్తమా వ్యాధిగ్రస్తులకు అందించే చేప ప్రసాదం పంపిణీ జూన్ 8న ప్రారంభించనున్నట్లు బత్తిని కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఉబ్బసం, శ్వాస కోస వ్యాధులను వివారించేందుకు ఉచితంగా అందించే చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో చేప ప్రసాదం పంపిణీ ఉంటుందని బత్తిని మృగశిర ట్రస్టు నిర్వాహకులు, దివంగత బత్తిని హరినాథ్ కొడుకు అమర్నాథ్ గౌడ్ తెలిపారు. జూన్ 8వ తేదీన తమ కుటుంబ సభ్యులు చేప ప్రసాదం సేవించిన తర్వాత సాయంత్రం నాంపల్లి లోని ఎగ్జిబిషన్ మైదానానికి తరలించనున్నట్లు తెలిపారు. ముహూర్తం ప్రకారం అదేరోజు రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. చేప ప్రసాదం పంపిణీకి ఇప్పటికే ఫిషరీ డిపా `టం `మెంట్, ఎగ్జిబిషన్ గ్రౌండ్, పోలీస్ డిపా `టం మెంట్, జీహెఎంసీ, ప్రభుత్వం పర్మిషన్ తీసుకున్నామని బత్తిని కుటుంబ సభ్యులు అమర్‌నాథ్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్, అనిరుధ్ గౌడ్, దుర్గా గౌడ్ మంగళవారం తెలిపారు. సుమారు 180 ఏండ్లకు పైగా చేప ప్రసాదం పంపిణీ జరుగుతోందని, ఎక్కడా ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్‌తో పాటు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. రెండు శతాబ్దాలుగా బత్తిని కుటుంబం చేపప్రసాదం పంపిణీ చేస్తోందని తెలిపారు. ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాశ సంబంధ వ్యాధుల నివారణకు మృగశిర కార్తె ప్రవేశించిన ఘడియల్లో ఓ పదార్థాన్ని చేప ద్వారా నోటిలో వేస్తామని ఆయన పేర్కొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి పెద్ద ఎత్తున చర్యలు

అమరావతి :

రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మైనార్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ మహ్మద్ నసీర్ స్పష్టం చేశారు. బుధవారం రాజధాని అమరావతిలోని ఏపీ అసెంబ్లీలో మైనార్టీస్ సంక్షేమ కమిటీ ఛైర్మన్ మహ్మద్ నసీర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహ్మద్ నసీర్ మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో మైనారిటీలకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. పీఎంజేవీవై కింద రూ.275 కోట్ల నిధుల విడుదల చేసినట్లు చెప్పారు. మైనారిటీల అభివృద్ధికి రూ.1000 కోట్ల డీపీఆర్‌లు సిద్ధం చేశామని పేర్కొన్నారు. గుంటూరు, నంద్యాలలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇమామ్, మౌజన్ల బకాయి గౌరవ వేతనాల విడుదల చేసినట్లు ఆయన వివరించారు.

# ఆరోగ్య భారతం – క్రీడా ప్రపంచం దిశగా నవతరం పయనం

**ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం:**

**ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం:**
**యాంత్రిక జీవనంపై క్రీడల విజయం**




ప్రపంచ గమనంలో మానవ మేధస్సు ఎంతగా అభివృద్ధి చెందినా, ఆ మేధస్సుకు ఆశ్రయమిచ్చే శరీరం దృఢంగా లేకపోతే ఆ ప్రగతి అశాశ్వతమని చరిత్ర నిరూపిస్తోంది. ఆధునిక యుగంలో మనిషి తన మేధోశక్తితో అద్భుతమైన సాంకేతిక విప్లవాన్ని సృష్టించాడు కానీ, అదే క్రమంలో తన సహజసిద్ధమైన శారీరక చురుకుదనాన్ని కోల్పోతున్నాడు. ఈ నేపథ్యంలో, ప్రపంచ వ్యాప్తంగా యువతలో క్రీడాస్ఫూర్తిని రగిలించి, శారీరక దృఢత్వాన్ని ఒక జీవన విధానంగా మార్చాలనే సదాశయంతో ప్రతి ఏటా మే 7వ తేదీన 'ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవాన్ని' జరుపుకుంటున్నాం. ఇది యాంత్రిక జీవన శైలిలో చిక్కుకున్న మానవాళికి ప్రకృతి ప్రసాదించిన శరీర శక్తిని గుర్తుచేసే ఒక మేల్కొలుపు పిలుపు.

ఈ దినోత్సవం యొక్క ఆవిర్భావాన్ని పరిశీలిస్తే, 1996వ సంవత్సరంలో అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య (IAAF – దీనిని ప్రస్తుతం 'వరల్డ్ అథ్లెటిక్స్' గా పిలుస్తున్నారు) అప్పటి అధ్యక్షుడు ప్రిమో నెబియోలో చొరవతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అథ్లెటిక్స్‌ను అన్ని క్రీడలకు తల్లిగా భావిస్తారు. పరుగెత్తడం, దూకడం, విసరడం వంటి ప్రాథమిక మానవ కదలికలే అథ్లెటిక్స్‌కు మూలాధారాలు. పాఠశాల స్థాయి నుంచే పిల్లలను క్రీడల వైపు మళ్లించడం, వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడం, తద్వారా ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై దేశ కీర్తి పతాకాన్ని ఎగురవేసే యోధులను తయారు చేయడం ఈ దినోత్సవం వెనుక ఉన్న బృహత్తర లక్ష్యం.

ప్రస్తుత సమాజంలో డిజిటల్ విప్లవం ఒకవైపు సౌకర్యాలను కల్పిస్తుంటే, మరోవైపు 'సెడెంటరీ లైఫ్ స్టైల్' (కదలిక లేని జీవనం) అనే ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. స్మార్ట్‌ఫోన్‌లు, వీడియో గేమ్‌లు, సామాజిక మాధ్యమాల మత్తులో పడి నేటి యువత మైదానాలకు దూరమవుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 80 శాతం మంది యుక్త వయస్కులు కనీస శారీరక శ్రమకు కూడా దూరంగా ఉంటున్నారు. ఈ గణాంకాలు అత్యంత ఆందోళన కరమైనవి. శారీరక శ్రమ లేకపోవడం వల్ల చిన్న వయసులోనే ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులు చుట్టు ముడుతున్నాయి. మానసిక ఒత్తిడి, కుంగుబాటు (డిప్రెషన్) వంటి సమస్యలకు కూడా శారీరక చురుకుదనం తగ్గడమే ప్రధాన కారణంగా మారుతోంది. ఈ సామాజిక జాడ్యాన్ని రూపుమాపడానికి అథ్లెటిక్స్ ఒక దివ్యౌషధంగా పనిచేస్తుంది.

అథ్లెటిక్స్ అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు, అది ఒక క్రమశిక్షణ. ఒక అథ్లెట్ ట్రాక్‌పై పరుగెత్తేటప్పుడు తన వేగాన్ని మాత్రమే కాదు, తన ఏకాగ్రతను, సహనాన్ని కూడా పరీక్షిస్తాడు. పరుగులో గెలుపు ఓటముల కంటే, ప్రతిరోజూ తన పాత రికార్డును తాను అధిగమించాలనే తపన మనిషిలో ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది. విద్యార్థి దశలో క్రీడల్లో పాల్గొనడం వల్ల మెదడుకు రక్తప్రసరణ పెరిగి, జ్ఞాపకశక్తి మెరుగు పడుతుందని, విశ్లేషణాత్మక ఆలోచనలు పెరుగుతాయని శాస్త్రీయ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. చదువులో రాణించాలంటే ఆటల మైదానంలో కూడా చెమట చిందించడం అవసరమని నేటి విద్యావ్యవస్థ గుర్తించాల్సి ఉంది.

భారతదేశం వంటి సువిశాల దేశంలో ప్రతిభకు కొదవలేదు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ప్రోత్సాహం అందితే అద్భుతాలు సృష్టించగల యువత ఎంతోమంది ఉన్నారు. గతంలో అథ్లెటిక్స్ అంటే కేవలం నగరాలకే పరిమితమనే భావన ఉండేది. కానీ, ఇటీవలి కాలంలో పరిస్థితులు మారుతున్నాయి. నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో సాధించిన చారిత్రాత్మక స్వర్ణ పతకం భారత క్రీడా చరిత్రలో ఒక మైలురాయి. హిమా దాస్, పి.టి. ఉష వంటి దిగ్గజాల స్ఫూర్తితో నేడు ఎంతోమంది గ్రామీణ యువతీ యువకులు ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో తమ సత్తా చాటుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఖేలో ఇండియా' పథకం క్రీడలను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లడంలో గణనీయమైన పాత్ర పోషిస్తోంది. పాఠశాలల్లో క్రీడా కోటా పెంచడం, క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటి చర్యలు యువతను ఈ రంగం వైపు ఆకర్షిస్తున్నాయి.

అయితే, సవాళ్లు కూడా అలాగే ఉన్నాయి. మన దేశంలో ఇప్పటికీ విద్యాసంస్థలు మార్కుల వేటలో పడి క్రీడలను ఒక అదనపు భారంగా భావిస్తున్నాయి. అనేక పాఠశాలలకు కనీస మైదాన సౌకర్యాలు లేవు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి శాస్త్రీయమైన శిక్షణ ఇచ్చే కోచ్‌ల కొరత వేధిస్తోంది. క్రీడలను కేవలం వినోదంగా కాకుండా ఒక కెరీర్‌గా ఎంచుకోవడానికి అవసరమైన ఆర్థిక భరోసా తల్లిదండ్రుల్లో కలగాలి. క్రీడల్లో రాణించడం వల్ల కేవలం పతకాలు మాత్రమే రావు, ఒక ఆరోగ్యవంతమైన తరానికి పునాది పడుతుందనే స్పృహ సమాజంలో రావాలి.

ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం సందర్భంగా మనం కేవలం అథ్లెట్ల విజయాలను కొనియాడటమే కాకుండా, సామాన్య ప్రజానీకాన్ని క్రీడల వైపు నడిపించే ప్రయత్నం చేయాలి. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కనీసం ఒక గంట పాటు ఏదో ఒక శారీరక శ్రమలో పాలుపంచుకోవాలి. యోగా, నడక, సైక్లింగ్ వంటివి జీవనశైలిలో భాగం కావాలి. నేటి డిజిటల్ యుగంలో సాంకేతికతను మన ఆరోగ్యానికి అనుకూలంగా మలచుకోవాలి. ఫిట్‌నెస్ ట్రాకర్లు, స్మార్ట్ వాచ్‌లు ఉపయోగించి మనం ఎన్ని అడుగులు వేశాం, ఎంత శక్తిని ఖర్చు చేశాం అనేది పర్యవేక్షించు కోవచ్చు.

ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తి ఎప్పటికీ సత్యం. దృఢమైన శరీరం లోనే దృఢమైన మనస్సు ఉంటుంది. ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం మనకు ఇచ్చే సందేశం ఒక్కటే – "కదలండి, పరుగెత్తండి, విజయాన్ని సాధించండి". క్రీడలు మనిషిని కేవలం ఆరోగ్యవంతుడిగానే కాకుండా, సమాజంలో బాధ్యతాయుతమైన, క్రమశిక్షణ కలిగిన పౌరుడిగా తీర్చిదిద్దుతాయి. ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలను మెరుగు పరచడం, విద్యాసంస్థలు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం, తల్లిదండ్రులు పిల్లలను మైదానాలకు పంపడం వంటి మార్పులు సంభవించినప్పుడే మనం నిజమైన ఆరోగ్య భారతాన్ని చూడగలం. ఈ దిశగా సాగే ప్రతి అడుగు దేశ భవిష్యత్తును బంగారుమయం చేస్తుంది. క్రీడా స్ఫూర్తిని రగిలిద్దాం, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**



# మధుమేహం ఉన్నవారు చికెన్ లేదా మటన్ తినవచ్చా?

## రక్తంలో చక్కెర పెరగకుండా ఉండాలంటే ఏం చేయాలి?

మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ ఆహారంలో ప్రోటీన్ వనరులను ఎంచుకోవడం చాలా కీలకం. సరైన ఆహార నియమాలు క్రమబద్ధమైన జీవనశైలి ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు. దీని కోసం కోడి మాంసం, మేక మాంసం మధ్య ఉన్న తేడాలను అర్థం చేసుకోవడం ముఖ్యం.



**మటన్**

మటన్‌లో ఐరన్, జింక్ విటమిన్ బి12 వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అయితే, ఇందులో అధికంగా ఉండే 'సంతృప్త కొవ్వు' మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిది కాదు. ఎర్ర మాంసాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ నిరోధకత పెరిగే అవకాశం ఉంది, ఇది టైప్ 2 డయాబెటిస్ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. అందువల్ల, మటన్‌ను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేకపోయినా, చాలా తక్కువ పరిమాణంలో, వారానికి ఒకటి లేదా రెండుసార్లు



మాత్రమే తీసుకోవడం మంచిది.

**చికెన్**

ఆరోగ్య నిపుణుల ప్రకారం, మధుమేహం ఉన్నవారికి చికెన్ ఒక సురక్షితమైన ఆరోగ్యకరమైన ఎంపిక. చికెన్‌లో ప్రోటీన్ అధికంగా ఉండి, కొవ్వు చాలా తక్కువగా ఉంటుంది. అంతేకాకుండా, చికెన్ గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది, దీనివల్ల దీన్ని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగవు.

**వండే పద్ధతి చాలా ముఖ్యం..**

మీరు ఏ మాంసం తింటున్నారనే దానికంటే, దానిని ఎలా వండుతున్నారనేదే చాలా ముఖ్యం. అధిక నూనె, నెయ్యి, వెన్న లేదా క్రీమ్‌తో వండిన మాంసం శరీరంలో కొవ్వును పెంచి మధుమేహంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. మాంసాన్ని ఆవిరి మీద (గాుఎఅస్త్ర) ఉడికించడం లేదా నీటిలో ఉడికించడం ఉత్తమం. తక్కువ నూనెతో గ్రిల్ చేయడం లేదా ఓవెన్‌లో బేక్ చేయడం మంచి పద్ధతులు. మాంసాహార కూర చేసేటప్పుడు నూనెను తగ్గించి, అందులో ఎక్కువ మొత్తంలో ఆకుకూరలు, కూరగాయలను చేర్చడం వల్ల ఫైబర్ అందుతుంది రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహం ఉన్నవారికి మటన్ కంటే చికెన్ మెరుగైన ఎంపిక. మటన్ అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవాలి, కానీ చికెన్‌ను పైన పేర్కొన్న ఆరోగ్యకరమైన వంట పద్ధతుల్లో మితంగా క్రమం తప్పకుండా తీసుకోవచ్చు. ఏ ఆహారమైనా సరే, మితంగా తీసుకోవడమే ఆరోగ్యానికి అసలైన రహస్యం.



# మంచిర్యాల జిల్లాలో విషాదం..

## నలుగురు రైతులు దుర్మరణం

### రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్, బీజేపీ డిమాండ్

### రూ.2 లక్షలు వ్యక్తిగత సహాయం ప్రకటించిన ఎమ్మెల్యే



**మంచిర్యాల, మే 6 (నినాదం):** ఆకాలం వర్షంతో కొనుగోలు కేంద్రాల వద్ద తాము పండించిన దాన్యంను తడవకుండా కాపాడుకునేందుకు అక్కడికి వెళ్లారు. భారీ వర్షం పడటంతో పాటు ఈదురుగాలులతో రెండు వేర్వేరు ఘటనలో నలుగురు రైతులు దుర్మరణం చెందారు. అందులో తండ్రి కుమారులు సైతం ఉన్నాడు.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. లక్సెట్టిపేట మండలం కొత్తూరు గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గాలి, వాన రావడంతో రైతులు ధాన్యంను కాపాడుకునేందుకు వెళ్లారు. భారీ వర్షం, ఈదురు గాలులు రావడంతో రైతులు ఓ గోడ వద్దకు చేరారు. అదే సమయంలో ముత్యంపేట గ్రామంకు చెందిన నెల్కి లచ్చన్న తన కొడుకును హైదారాబాద్ కి బస్సు ఎక్కించి ఇంటికి వస్తున్న క్రమంలో వర్షం రావడంతో అక్కడి గోడ వద్దకు చేరాడు. ఒక్కసారిగా గోడ కూలడంలో నెల్కి లచ్చన్నతో పాటు రైతు వెంకటేష్ దుర్మరణం చెందాడు పలువురికి గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు. గంపలపల్లి గ్రామానికి చెందిన నాగరాజు అతని కుమారుడు అభిరాం ధాన్యంపై పరదాలు కప్పేందుకు వెళ్లారు. వర్షం ఎక్కువ కావడంతో పక్కన ఉన్న రేకుల షెడ్ లోకి వెళ్లారు. కొంత సేపటి తర్వాత షెడ్ కూలడంతో తండ్రీ కొడుకులు మృతి చెందారు.

**రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి**
**-బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జీవన్ రెడ్డి**

గాలి, వాన భీభత్సం కారణంగా మృతి చెందిన నలుగురు రైతుల కుటుంబాలకు రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం లక్సెట్టిపేట మండలం మోత్కుర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావుతో కలిసి జాతీయ రహదారిపై బైఠాయించారు. ధాన్యం కొనుగోలు జాప్యం కారణంగా రైతులు మృతి చెందారని పేర్కొన్నారు. అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల మృతికి బాధ్యతగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని పేర్కొన్నారు.



**రైతుల మరణానికి ప్రభుత్వమే కారణం**
**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి**



రైతుల మరణానికి ప్రభుత్వమే కారణం అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాల వల్ల ఈదురు గాలులతో కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం పై కవర్లు కప్పడానికి వెళ్లి లక్షెట్టిపేట మండలం గంపాలపల్లి మరియు కొత్తూర్ గ్రామాల్లో జరిగిన ప్రమాదంలో నలుగురు రైతులు మరణించడం అత్యంత విషాదకరం అని అన్నారు. లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రమాద వివరాలు తెలుసుకొని వారికి మనోధైర్యం కల్పించడం జరిగింది. బాధిత కుటుంబాలకు తన వంతుగా ఒక్కొక్కరికి 50 వేల రూపాయల తక్షణ ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ రైతులు ధాన్యం అమ్మకానికి కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చి నెల రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సరియైన సమయంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు ప్రతి రోజు కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కమీషన్ల కోసం రైస్ మిల్లర్లతో కుమ్మక్కు అయ్యి కాంట పెట్టిన ధాన్యం లారీలు దొరకక ధాన్యాన్ని తరలించడంలో ప్రభుత్వం విఫలం అవ్వడంతో రైతులకు ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. నాలుగు రైతుల మరణం ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని అన్నారు. బాధితుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఒక్కక్కరికి 50 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని అన్నారు.

**ప్రజల రక్షణ పోలీసుల ధ్యేయం...**
**రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అకాల గాలి వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో చెట్లు రోడ్లపై కూలిపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీస్ అప్రమత్తంగా ఉండి చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు, వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడం జరిగింది. రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎం. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్ కలిసి క్షేత్ర స్థాయిలో మంచిర్యాల, హాజీపూర్, లక్షెట్టి పేట, దండేపల్లి వెళ్లే రహదారిపై పడిపోయిన చెట్లను పరిశీలించి, పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు గ్రామస్తుల సహకారంతో వాటిని తొలగించడం జరిగింది.

అనంతరం సీపీ స్వయంగా దండేపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, సిబ్బందితో సమావేశమై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. అదేవిధంగా, కోత్తూరు గ్రామ బస్టాప్ ప్రాంతంలో గోడ కూలి ఇద్దరు మృతి చెందిన ఘటన, అలాగే గంపలపల్లి గ్రామ శివారు ప్రాంతంలోని సామిల్‌లో గోడ కూలి ఇద్దరు మరణించిన సంఘటనల స్థలాలను సీపీ సందర్శించారు.

ఈ సందర్భంగా సంఘటనల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రజల భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని, వాతావరణ మార్పుల సమయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

**రైతు మృతుల కుటుంబాలకు**
## రూ. 2 లక్షలు సాయం
**ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు**



లక్షెట్టిపేట మండలంలోని కొత్తూరు, గంపలపల్లి గ్రామాల్లో ప్రమాద ఘటనలపై మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు విచారణ వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరణించిన నలుగురు రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల వ్యక్తిగత సహాయం అందజేస్తానని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం 5 లక్షల రూపాయలు అందిస్తానని హామీ ఇచ్చారు.. ఆ రైతుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు..

# మేమున్నాం.. నడుపుకోండి !

### స్మగ్లర్లకు అధికారుల భరోసా

### మళ్లీ మొదలైన రేషన్ బియ్యం స్మగ్లింగ్

### వేంపల్లి వైపు వెళ్తూ కెమెరాకు చిక్కిన ఓ వ్యాను

### కాగజ్ నగర్ లో బియ్యం దొంగల బరితెగింపు




**కాగజ్‌నగర్,మే6(నినాదం):** నినాదం వరుస కథనాలు,జిల్లా కలెక్టర్,ఎస్పీ ల సత్వర స్పందన ఫలితంగా కాగజ్ నగర్ ప్రాంతంలో పీడీఎస్ స్మగ్లింగ్ కథ దాదాపు ముగిసింది. కింది స్థాయి అధికారుల సహకారమో ,లేక మాఫియా బరితెగింపో గానీ మూడు రోజుల క్రితం మళ్లీ మొదలైంది. పెద్ద మొత్తంలో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ బుధవారం ఓ ఐచర్ వ్యాను దర్శనమిచ్చింది. సదరు వ్యాను కోసుని గ్రామం పర్ధాన్ గూడ సమీపంలో సుమారు ఉదయం 11:30 ప్రాంతంలో నినాదం కెమెరాకు చిక్కింది. దీంతో కాగజ్ నగర్ లోని రేషన్ స్మగ్లర్ల కథ మళ్లీ మొదటికొచ్చింది.కాగా వీరి బరితెగింపు వెనుక ఉన్నదెవరు, వారికి వీరితో కుదిరిన ప్రయోజన ఒప్పందాలేంటి అనే మొదలగు అంశాల్లో స్పష్టత రావాల్సి ఉంది. మరి చూడాలి ఈ అగ్నిపరీక్షను కాగజ్ నగర్ ప్రాంత సంబంధిత శాఖల అధికారులు ఎలా ఎదుర్కుంటారనేది.

## నెలకు రూ.12,500 పెట్టుబడితో
# చేతికి రూ. 66 లక్షలు..!

**నెలకు రూ.12,500 పెట్టుబడి**

ఒక వ్యక్తి ఏడాదికి రూ.1.5 లక్షలు PPFలో పెట్టుబడి పెడితే, 20 ఏళ్లలో అతని ఫండ్ రూ.66 లక్షల కంటే ఎక్కువగా ఉంటుంది. అంటే మీరు నెలకు దాదాపు రూ.12,500 పొదుపు చేయాలి. ఈ పథకం ప్రత్యేకత ఏమిటంటే మీరు పొందే లాభంపై ఎటువంటి పన్ను (ఖుఇ) చెల్లించాల్సిన అవసరం లేదు. అందుకే రిటైర్మెంట్ ప్లానింగ్ కోసం ఇది నమ్మదగిన ఎంపిక.

**పెద్ద మొత్తంలో ఫండ్ ఎలా తయారవుతుంది?**

ప్రస్తుతం పీపీఎఫ్‌పై ఏడాదికి 7.1% వడ్డీ లభిస్తోంది. మీరు ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో (ఏప్రిల్ 1 నుండి 5 మధ్య) రూ.1.5 లక్షలు జమ చేస్తే ఆ ఏడాది మొత్తంపై వడ్డీ లభిస్తుంది. ఇలా 20 ఏళ్ల పాటు పెట్టుబడి పెట్టడం వల్ల 'కాంపౌండింగ్' (చక్రవడ్డీ) ప్రభావంతో మీ డబ్బు వేగంగా పెరుగుతుంది.

**20 ఏళ్లలో వచ్చే లాభాల లెక్కలివే (అంచనా):**

వార్షిక పెట్టుబడి: రూ.1,50,000 (నెలకు రూ.12,500 లేదా రోజుకు రూ.417)
పెట్టుబడి కాలం: 20 ఏళ్లు
వడ్డీ రేటు:
7.1% (ప్రస్తుత రేటు ప్రకారం)
మొత్తం పెట్టుబడి: రూ.30,00,000
పొందే మొత్తం వడ్డీ: రూ.36,58,288
మెచ్యూరిటీ మొత్తం: రూ.66,58,288
అంటే మీరు కేవలం రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టి, రూ.66.5 లక్షల పన్ను రహిత ఆదాయాన్ని పొందవచ్చు.

**పీపీఎఫ్ మెచ్యూరిటీ నియమాలు:**

పీపీఎఫ్ ఖాతా కాలపరిమితి సాధారణంగా 15 ఏళ్లు. దీనిని కావాలనుకుంటే 5 ఏళ్ల చొప్పున ఎన్నిసార్లయినా పొడిగించు కోవచ్చు.ఒకవేళ కొత్తగా డబ్బు జమ చేయకుండా ఖాతాను కొనసాగించాలను కుంటే, కేవలం ఒకసారి మాత్రమే 5 ఏళ్ల పొడిగింపునకు అవకాశం ఉంటుంది.

**నినాదం మార్కెట్**

# శాంసంగ్ @ 1 ట్రిలియన్ డాలర్లు




ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ శాంసంగ్ (ఖుఎంబఅస్త్ర) షేర్లు భారీగా పెరిగాయి. బుధవారం ఈ కంపెనీ షేర్లు ఏకంగా 15శాతం పెరగడంతో.. మార్కెట్ విలువ 1 ట్రిలియన్ డాలర్ల (రూ.95 లక్షల కోట్లకు పైగా) మార్క్‌ను దాటి పరుగులు పెడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (గాx) టెక్నాలజీ అంతకంతకూ విస్తరిస్తున్న నేపథ్యంలో మెమొరీ చిప్‌లకు భారీగా డిమాండ్ పెరుగుతుండడంతో శాంసంగ్ భారీగా లాభాలను దక్కించుకుంటోంది. తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ తర్వాత ఈ మార్కును చేరిన రెండో ఆసియా కంపెనీగా ఇది నిలిచింది. రాబోయే 12 నెలల్లో ఈ స్టాక్ సుమారు 30 శాతం పెరుగుతుందని బ్లూమ్‌బర్గ్ నివేదికలు పేర్కొంటున్నాయి.

శాంసంగ్ సెమీకండక్టర్ విభాగం మార్చి త్రైమాసికంలో అంచనాలను మించి 48 రెట్ల చారిత్రక లాభాన్ని ఆర్జించింది. ఏఐ డేటా సెంటర్ ఆర్డర్లు భారీ మార్జిన్లను అందించడమే దీనికి కారణం. పరిమిత సరఫరా మధ్య కాంట్రాక్ట్ ధరలు మరింత వేగంగా పెరుగుతుండడంతో రాబోయే పలు త్రైమాసికాలలో ఈ విభాగం తన రికార్డు స్థాయి లాభాన్ని మరింత పెంచుకుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచ మార్కెట్‌లో అధునాతన చిప్‌లు, కంప్యూటింగ్ సామర్థ్యానికి నిరంతరం డిమాండ్ పెరుగుతుండడంతో ఎస్కే హైనిక్స్, టీఎస్ఎంసీ వంటి ఇతర మెమొరీ సంస్థల షేర్లు కూడా ఈ నెలలో రికార్డు స్థాయి గరిష్టాలకు చేరుకున్నాయి.

అమెరికాలో తన డివైజ్‌ల కోసం ప్రధాన ప్రాసెసర్‌లను ఉత్పత్తి చేయడానికి శాంసంగ్‌ను ఉపయోగించుకోవడంపై యాపిల్, ఆ సంస్థతో ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం మెమొరీ మార్కెట్‌లో సరఫరా కొరత ఉందని జూపిటర్ అసెట్ మేనేజ్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్ సామ్ కొన్రాడ్ పేర్కొన్నారు. ఈ ఏడాదితో పోల్చితే 2027లో దీని డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

### ఆఖర్లో దూసుకెళ్లిన
# సూచీలు..
### 24,300 పైకి నిఫ్టీ




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు తెరించేలా అమెరికా, ఇరాన్ దేశాలు ఒక ఒప్పందానికి చేరువయ్యాయన్న వార్తలు మార్కెట్‌లో ఉత్సాహానికి కారణమయ్యాయి. ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలతో బ్రెంట్ క్రూడ్ కూడా దాదాపు 9 శాతం క్షీణించి 100 డాలర్లకు చేరువ అవ్వడం మరింత కలిసొచ్చింది. దీంతో ఉదయం లాభనష్టాల మధ్య కదలాడిన సూచీలు.. చివరి గంటలో దూసుకెళ్లాయి. మదుపర్ల సంపద సుమారు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.473 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,424.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,017.79) లాభాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు లాభాల్లో కొనసాగిన సూచీ.. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి దాదాపు 800 పాయింట్లు క్షీణించింది. అమెరికా- ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన వార్తలు రావడంతో సూచీ పుంజుకొంది. చివరికి 940.73 పాయింట్ల లాభంతో 77,958.52 వద్ద ముగిసింది. నిఫ్టీ 298.15 పాయింట్ల లాభంతో 24,330.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 56 పైసలు బలపడి 94.62గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో ఏకంగా 6 శాతం మేర దూసుకెళ్లింది. ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్ల వద్ద ట్రేడవుతండగా.. బంగారం ఔన్సు 4700 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### బయోకాన్ వారసురాలు
# క్లెయిర్ మజుందార్!
### కిరణ్ మజుందార్‌కు మేనకోడలే





బయోకాన్ వ్యవస్థాపకురాలు, ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా అధికారికంగా వారసత్వ ప్రణాళికను ప్రకటించారు. తన సోదరుడి కుమార్తె క్లెయిర్ మజుందార్ షాకు కంపెనీ పగ్గాలు ఇవ్వబోతున్నట్లు ఫార్చ్యూన్ ఇండియాకిచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. నాలుగు దశాబ్దాల కిందట బయోకాన్‌ను స్థాపించిన మజుందార్ షాకు పిల్లలు లేరు. రూ.44,000 కోట్లకు పైగా మార్కెట్ విలువ కలిగిన తమ కంపెనీ తదుపరి దశ వృద్ధికి నేతృత్వం వహించడానికి, 37 ఏళ్ల క్లెయిర్ మజుందార్ సరైన వ్యక్తి అని నమ్ముతున్నట్లు ఆమె తెలిపారు. 'బయోకాన్‌కు ఏకైక యజమానిని నేనే. ఈ కంపెనీని నమ్మదగ్గ వ్యక్తుల చేతుల్లో పెట్టేలా నేను చూసుకోవాలి. నా మేనకోడలు క్లెయిర్‌ను నా వారసురాలిగా చూశాను. ఒక కంపెనీని నిర్వహించగలదని తను ఇప్పటికే నిరూపించుకుంద'ని కిరణ్ వివరించారు.

**ఇపుడే కాదు..**

యాజమాన్య మార్పు వెంటనే జరగదని, అందుకు సమయం పడుతుందని ఆమె చెప్పారు. 'నా బాధ్యతల నుంచి తొలగాలని ఇపుడే అనుకోవడం లేదు. నా పాత్రలోకి క్లెయిర్‌ను క్రమక్రమంగా తీసుకువస్తాను' అని పేర్కొన్నారు. వారసత్వ ప్రణాళిక ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి నాయకత్వ బాధ్యతలను కిరణ్ వీడేది లేదని స్పష్టం చేసినట్లయింది.

**ఎవరీ క్లెయిర్..**

బయోకాన్‌లోనే ఆవిర్భవించిన బయాకరా థెరప్యూటిక్స్‌కు వ్యవస్థాపకురాలు, సీఈఓగా క్లెయిర్ ఉన్నారు. నాస్‌డాక్ లిస్టెడ్ కంపెనీ ఇది. ఎమ్ఐటీ నుంచి బయోలాజికల్ ఇంజినీరింగ్, స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎమ్‌బీఏ చదివిన క్లెయిర్‌కు క్యాన్సర్ బయాలజీలో స్టాన్‌ఫోర్డ్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ నుంచి పీహెచ్‌డీ కూడా ఉంది. బయాకరాకు ముందు థర్డ్ రాక్ వెంచర్స్‌లో సీనియర్ అసోసియేట్‌గా, రియోస్ మెడిసిన్స్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్, కార్పొరేట్ స్ట్రాటజీకి అధిపతిగా పనిచేసిన అనుభవమూ ఉంది. అంతర్జాతీయ లాభాపేక్ష రహిత సంస్థ నూరా హెల్త్‌లో బోర్డు సభ్యురాలిగానూ ఉన్నారు. బయాకరాను 2024లో నాస్‌డాక్‌లో లిస్ట్ చేశారు. 1.6 బి. డాలర్లకు పైగా మార్కెట్ విలువ దీని సొంతం. క్లెయిర్ సోదరుడు ఎరిక్ మజుందార్ ఒక కాల్‌టెక్ ప్రొఫెసర్, ఏఐ నిపుణుడిగా ఉన్నారు.క్లెయిర్ భర్త థామస్ రాబర్ట్స్ మసాచుషెట్స్ జనరల్ హాస్పిటల్స్‌లో అంకాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరీ మద్దతూ భవిష్యత్‌లో బయోకాన్‌కు ఉండనుంది.

**ఇప్పటికే సంస్థలో పలు మార్పులు..**

బయోకాన్ తన జనరిక్స్, బయోలాజిక్స్ వ్యాపారాలను విలీనం చేసింది. రుణమొత్తాన్ని తగ్గించింది. కంపెనీ ఆదాయంలో 60% వాటా ఉన్న బయోసిమిలర్స్‌పై దృష్టి సారిస్తోంది. ఇప్పటికే 12 ఉత్పత్తులు మార్కెట్లో ఉండగా, మరో 20 మార్కెట్లోకి రానున్నాయి. మరో వైపు బయోకాన్ బయోలాజిక్స్ సీఈఓ, ఎండీగా శ్రీహాస్ తంబేను నియమించారు. అనుబంధ సంస్థ సింజీన్ ఇంటర్నేషనల్‌కు సిద్ధార్థ్ మిత్తల్ జులై 1 నుంచి నేతృత్వం వహించనున్నారు.

# చట్టబద్ధ దత్తత ద్వారా ఇద్దరు దంపతులకు పిల్లల వరం

## రక్త సంబంధీకుల నుంచి దత్తతకు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తర్వులు జారీ

**కరీంనగర్, మే 6(నినాదం):** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో, కరీంనగర్ జిల్లాకు చెందిన పిల్లలు లేని ఇద్దరు దంపతులకు రక్త సంబంధీకుల నుంచి చట్టబద్ధ దత్తత ప్రక్రియ పూర్తి చేసి, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా చేతుల మీదుగా దత్తత ఉత్తర్వులు అందజేశారు. ఒక దంపతికి పాపను, మరొక దంపతికి బాబును దత్తతగా ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు తప్పనిసరిగా చట్టబద్ధ దత్తతనే చేపట్టాలని సూచించారు. రక్త సంబంధీకుల నుంచి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా పరిషత్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి దుర్దాన పర్వీన్, బాలల సంక్షేమ కమిటీ అధ్యక్షురాలు ధనలక్ష్మి, న్యాయ సహాయక అధికారి రాజు, డేటా విశ్లేషకుడు రాజ్ కుమార్ పాల్గొన్నారు



# ప్రతి గింజనూ కొంటాం: మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, మే 6 (నినాదం);** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం రైతు వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులకు సాగుపై అవగాహన కల్పించేందుకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మొక్కజొన్న, వరి దిగుబడి అధికంగా వచ్చిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాల ద్వారా వేగంగా సేకరణ చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు.రైతులు సాంప్రదాయ పంటలతో పాటు లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని మంత్రి



సూచించారు. ఆయిల్ పామ్ సాగు వల్ల ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణ ఉండటంతో పాటు నెలనెలా స్థిరమైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. నంగునూరు, నర్మేట ప్రాంతాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు అందుబాటులోకి వచ్చాయని గుర్తుచేశారు. అలాగే కూరగాయల సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా హుస్నాబాద్‌లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామని



హామీ ఇచ్చారు. ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సబ్సిడీపై అధునాతన యంత్రాలు, విత్తనాలు, ఎరువులు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, కౌన్సిలర్లు, ఆర్డీవో మరియు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

### హిందూ ఐక్యతకు పిలుపునిచ్చిన

# మహాశక్తి దేవాలయ సమ్మేళనం

## కరీంనగర్ చైతన్యపురిలో ఘనంగా నిర్వహణ
## కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరు



**కరీంనగర్, మే 6(నినాదం )** కరీంనగర్ పట్టణంలోని చైతన్యపురి బస్తీలో ఉన్న శ్రీ మహాశక్తి దేవాలయం ప్రాంగణంలో హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు.సమ్మేళనంలో ప్రధాన వక్తగా పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ జయదేవ్ మాట్లాడుతూ, హిందూ సమాజం కులాల పేరుతో విభజించుకోకుండా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. హిందూ ఐక్యత సమాజానికి అపార శక్తిని అందిస్తుందని పేర్కొన్నారు.సనాతన ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వధర్మంపై అంకితభావం సేవాభావం పెంపొందించ డమే ఇలాంటి సమ్మేళనాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ప్రయాణం దేశహితం, ధర్మ పరిరక్షణకు అంకితమై కొనసాగిందని చెప్పారు.శతాబ్ది ఉత్సవాల సందర్భంగా "పంచ పరివర్తన్" అంశాలతో సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో చైతన్యపురి హిందూ సమ్మేళన సమితి సభ్యులు, స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరీక్ష ఏదైనా అల్ఫోర్స్ విద్యార్థులదే ఘన విజయం

ఐఐటీ జేఈఈ మెయిన్ బి.ఆర్క్
బి.ప్లానింగ్ ఫలితాలలో అద్భుత ర్యాంకులు
బిఆర్క్ విభాగంలో ఎస్. శ్రీహిత 174వ ర్యాంకుతో అగ్రస్థానం
అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా వి. నరేందర్ రెడ్డి

**కరీంనగర్, మే 6(నినాదం):** తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాలలో పేరొందిన అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఐఐటీ జేఈఈ మెయిన్ బి.ఆర్క్, బి.ప్లానింగ్--2026 ఫలితాలలో విశిష్ట ప్రతిభ కనబరిచారు. బిఆర్క్ విభాగంలో ఎస్. శ్రీహిత 174వ ర్యాంకుతో అగ్రస్థానంలో నిలవగా, పటేల్ అక్షయ, డి. తనుశ్రీ, వి. రితిక, ఎస్. ఆధ్య తదితరులు కూడా ఉత్తమ ర్యాంకులు సాధించి సంస్థకు కీర్తి తెచ్చారు. అలాగే బి.ప్లానింగ్ విభాగంలో వి. ప్రణతి 85రవ ర్యాంకుతో ముందంజలో నిలిచింది.ఈ విజయానికి సమర్థమైన బోధన, క్రమబద్ధమైన ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతో పాటు విద్యార్థుల కృషి ప్రధాన కారణమని సంస్థ చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి తెలిపారు. రాబోయే ఐఐటీ అడ్వాన్స్‌డ్




పరీక్షకు ఎంపికైన విద్యార్థులకు నిపుణుల బృందం ద్వారా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.ప్రతి సంవత్సరం ఐఐటీ, నీట్, ఈఏపీసెట్ వంటి పోటీ పరీక్షల్లో అల్ఫోర్స్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొంటూ, ఈసారి ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.

### తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమశాఖ

# కార్పొరేషన్ చైర్మన్‌గా జువ్వాడి

## జువ్వాడి నర్సింగరావుకు మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ శుభాకాంక్షలు



**కోరుట్ల, మే 6(నినాదం):** తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్ గా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు బుధవారం ఎన్నికయ్యారు. కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మెట్ పల్లి పట్టణ జువ్వాడి భవన్ లో నర్సింగరావు ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించితినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ తో పాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మెట్పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్, శంకర్, జమున, అక్షయ్ తదితరులు బోకే అందించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విధంగా పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# అధైర్యపడకండి అండగా ఉంటాం..

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..
నష్టపోయిన రైతులను ఆదుకోండి
అధికారులకు సూచించిన ప్రణవ్



**జమ్మికుంట మే 6 (నినాదం)** : రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ముందు ఉంటుందని,మంగళవారం వావిలాల నుండి వంతడుపుల వెళ్ళే రహదారిలో జరిగిన ప్రమాదం తెలిసిన వెంటనే అధికారులను రైతులను ఆదుకోవాలని ఆదేశించామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడతల ప్రణవ్ అన్నారు.బుధవారం ప్రమాదం జరిగిన ప్రదేశానికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి రైతులతో మాట్లాడారు.ప్రమాదానికి గల కారణాలను,పంట నష్ట పోయిన తీరును రైతుల నుండి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రణవ్ ను చూడగానే రైతులు కంటతడి పెట్టగా వారిని ఓదార్చారు.ఇది పూర్తిగా రైతు ప్రభుత్వమని రైతులు అధైర్యపడవద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అధికారులకు ఫోన్ చేసి త్వరితగతిన నష్ట పరిహారం అందేలాగా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వావిలాల గ్రామ సర్పంచ్ అర్జున్,తనుగుల గ్రామ సర్పంచ్ కిరణ్,వార్డ్ సభ్యులు,మార్కెట్ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి,డిసిసి ఉపాధ్యక్షులు మేలుగూరి సదయ్య,డైరెక్టర్లు,మండల,పట్టణ అధ్యక్షులు పరశురామ్, రమేష్,యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సజ్జు,సీనియర్ నాయకులు దేశిని కోటి,రాకేష్ రెడ్డి,సాయిని రవి,పూరేళ్ళ రాకేష్,పొనగంటి మధు,నాగేంద్ర,తదితరులు పాల్గొన్నారు.



### సెన్సెస్ వ్యక్తిగతంగా

# నమోదు చేసుకోవచ్చు..

## మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి




**జమ్మికుంట, మే 6 (నినాదం):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక తీసుకున్న జనాభా నమోదు వ్యక్తిగతంగా నమోదు చేసుకొనే వారు ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా గణన 2026-27 జనాభా నమోదు కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేది నుండి ఎన్యూమరేట్లు మీ ఇంటికి వచ్చి జనాభా గణన నమోదు చేస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సెన్సెస్ వివరాలలో పొందుపర్చిన ప్రతి అంశాన్ని నింపి, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం పూర్తి చేస్తారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఈ సర్వే పూర్తి కావడానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతున్న సొంతింటికల

## ఇందిరమ్మ ఇండ్లతో పేదల కళ్ళల్లో ఆనందం...

### నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ప్రణవ్



**జమ్మికుంట, మే 6 (నినాదం):** ప్రతి వ్యక్తి జీవితంలో సొంతింటి కల అనేది ఒక జీవిత కల అని,పదేళ్ల నిరీక్షణకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేసి ఇళ్ళు కట్టుకో వాలనుకునే పేదవాడి సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుం దనీ హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడతల ప్రణవ్ అన్నారు.బుధవారం నాడు ఆయన వీణవంక మండల కేంద్రంలోని రామ కృష్ణపూర్, నర్సింగపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశ మహోత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.లబ్దిదారులు నియోజకవర్గ ఇంచార్జికి ఘన స్వాగతం పలికారు.ఎన్నికల్లో మాట ఇవ్వడమే కాకుండా ఇచ్చిన మాట ప్రకారం మాకు ఇల్లు మంజూరు చేసి మాకు ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ ప్రభుత్వం,ఇంచార్జి ప్రణవ్‌బాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు ఇచ్చిన మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లతో పాటు నెలాఖరుకు మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తా మని ప్రణవ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉచిత మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం

## రెనే హాస్పిటల్, శ్రీ లక్ష్మి మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
## 18 మంది లబ్ధిదారులకు నూతన సాంకేతికతతో సేవలు: డా. బంగారి స్వామి, డా. రజని ప్రియదర్శిని

**కరీంనగర్, మే 6(నినాదం):** రెనే హాస్పిటల్, శ్రీ లక్ష్మి మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మోకాలి కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయి. ప్రొఫెసర్ డా. బంగారి స్వామి, డా. రజని ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఎంపికైన 18మంది రోగులకు శస్త్ర చికిత్సలు చేసి,వారిని ఆరోగ్యంగా ఆసుపత్రి నుండి విడుదల చేశారు.ఈసంవత్సరం మార్చిలో నిర్వహించిన వైద్య శిబిరానికి వచ్చిన సుమారు 600 మంది రోగులలో 18మందిని ఎంపిక చేసి ఉచితంగా చికిత్స అందించారు. వీరిలో 8మందికి అత్యాధునిక రోబోటిక్ విధానం ద్వారా, మిగిలిన వారికి సాధారణ పద్ధతిలో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డా. కవ్వం పల్లి సత్యనారాయణ, సుమారు 40 లక్షల రూపా యల విలువైన వైద్య సేవలను ఉచితంగా అందించడం గొప్ప విషయమని ప్రశంసించారు.




అలాగే జిల్లాకు రోబోటిక్ సాంకేతికతను తీసుకు వచ్చి పేదలకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని తెలిపారు.ప్రొఫెసర్ డా. బంగారి స్వామి మాట్లాడుతూ, తన తల్లిదండ్రుల స్మారకార్థం ఈసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో కూడా నిరంతరంగా కొనసాగిస్తామని చెప్పారు. అలాగే పేద దంపతులకు ఉచిత వంధ్యత్వ చికిత్సలు, సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతున్న పిల్లలకు ఉచిత వైద్యం అందించే ప్రణాళికలు ఉన్నాయని వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో రజని ఐవీఎఫ్ ఫౌండర్, రెనే వైద్య సంస్థల మేనేజింగ్ డైరెక్టర్. డా. రజని ప్రియదర్శిని,రెనీ హాస్పిటల్ అనస్తీసియా విభాగాధిపతి డాక్టర్ మునిష్,అనస్తీసియా డాక్టర్ కృష్ణారెడ్డి, డా. లతీష్‌రెడ్డి,గుండె వైద్యులు డా.సురేష్ కుమార్, ఆర్థోపెడిక్ డాక్టర్ సుధీర్ ద్వారక్ నాయుడు జనరల్ ఫిజిషయన్ డా.నిఖిల్ లక్ష్మణ్ , పీజీ వైద్య విద్యార్థులు డాక్టర్ విశాల్ అండ్ వైభవ్ , సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ కమలుద్దీన్, డైటీషియన్ డా.పులి స్వాతి, జూనియర్ వైద్య బృందమైన డా.నవ్య,డా.సారా ఫాతిమా, డా.ఆదిత్య, ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో పట్టణాభివృద్ధికి కొత్త దిశ

## కరీంనగర్ నగరానికి అభివృద్ధి ప్రణాళికలు
## త్వరగా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు



**కరీంనగర్, మే 6(నినాదం):** పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకాన్ని సమర్థంగా వినియోగించుకో వాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభి వృద్ధి శాఖ అదనపు కార్యదర్శి డి. తారా ఐఏఎస్ సూచించారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ శాఖ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కరీంనగర్ నగరపాలక సంస్థ నుంచి మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఇంజనీరింగ్ విభాగ అధికారులు పాల్గొన్నారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుందరీకరణ, ఆధునిక వసతుల కల్పనకు ఈ పథకం ద్వారా నిధులు పొందేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు.అత్యవసర మౌలిక సదుపాయాల గుర్తింపు, పర్యావరణహిత, ప్రజలకు ఉపయోగ కరమైన వినూత్న ప్రాజెక్టులకు ప్రాధాన్యత, నిధుల సమీకరణ, అమలులో పారదర్శకత వంటి అంశాలపై చర్చించారు. కరీంనగర్ నగర అభివృద్ధికి ఇది మంచి అవకాశమని పేర్కొంటూ, అవసరమైన ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేసి ప్రభుత్వానికి గడువులోగా నివేదికలు పంపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు కాటన్ టవల్స్ పంపిణీ

## కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్

**కోరుట్ల, మే 6 (నినాదం):** వేసవి తీవ్రత దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను వడ దెబ్బ తగల కుండా ఉండటానికి నెత్తికి కాటన్ టవాల్స్ కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ పంపిణీ చేశారు.కోరుట్ల పట్టణ మున్సిపల్ కార్యాలయంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కమిషనర్ శ్రీనివాసరావు వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఎండ దెబ్బ తగలకుండా ఉండటానికి నెత్తికి ఎండ తగలకుండా ఉండేందుకు కాటన్ టవాల్స్ అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల



వసంతా గంగాధర్, కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున పారిశుద్ధ్య కార్మికులు వాటర్ సప్లై ఎలక్ట్రికల్ కార్మికులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ విధులను నిర్వహించాలని సూచించారు. అలాగే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### శాతవాహన విశ్వవిద్యాలయం

# పీడీసీ ఫలితాల విడుదల

**ధర్మపురి, మే 6( నినాదం):** శాతవాహన విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థ అయిన శ్రీ లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల (నైట్ కాలేజ్) ప్రీడిగ్రీ కోర్సు (తెలుగు) ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను,వేములవాడ శ్రీ రాజరాజేశ్వర సంస్కృత కళాశాలకు సంబంధించిన ఎంట్రన్స్, పీడీసీ (సంస్కృతం )ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్ కుమార్ బుధవారం విడుదల చేసారని విద్యార్థులు తమ ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌లో పొందవచ్చనిశ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల ప్రిన్సిపల్ డా.గుంపుల ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల (నైట్ కాలేజ్) లోప్రీ డిగ్రీ కోర్సు ప్రథమ సంవత్సరంలో 99 శాతం, ద్వితీయ సంవత్సరంలో 100 శాతం మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ సంగనభట్ల రామకిష్టయ్య , ప్రిన్సిపాల్ డాక్టర్




జి. ప్రభాకర్ అభినందించారు. ఇదిలా ఉండగా, బి.ఏ. లాంగ్వేజెస్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దోస్త్ మాధ్యమం ద్వారా పరిమిత సీట్లకు అడ్మిషన్లు కొనసాగుతున్నాయని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ల వివరాల కోసం కళాశాలలో లేదా94413 14805 నెంబరులో సంప్రదించాలని కోరారు.

# ఇంటర్ రెమెడియల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



**హుజురాబాద్, మే 6(నినాదం):** హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీ వి. ఆంజనేయరావు సందర్శించారు. ఈ సందర్భంగా గత మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ ఫలితాలలో అనుత్తీర్ణులైన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న రెమెడియల్ తరగతులను పరిశీలించారు. రెమెడియల్ తరగతులకు హాజరైన విద్యార్థులతో మాట్లాడిన ఆయన, రాబోయే ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. కొన్ని కారణాల వల్ల ఒకటి లేదా రెండు విషయాల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయినా, నిరుత్సాహపడకుండా ముందుకు సాగాలని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. విద్యా సంవత్సరం నష్టపోకుండా, వచ్చే పరీక్షల్లో కేవలం వారం రోజుల పాటు కృషితో చదివితే ఉత్తీర్ణత సాధించవచ్చని పేర్కొన్నారు.అదేవిధంగా ఉత్తీర్ణత సాధించడం ద్వారా డిగ్రీ మరియు ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులకు ప్రాధాన్యత కలిగిన ప్రశ్నలు, సమాధానాలను అందించి సమర్థంగా బోధించాలని అధ్యాపకులకు సూచించారు. దీంతో కళాశాల అడ్మిషన్లు కూడా పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ బల్బీర్ సింగ్, కళాశాల అధ్యాపకులు మల్లారెడ్డి, విజయేందర్ రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.



# సీసీ కెమెరాలు ఏర్పాటు చేయని లాడ్జ్‌లపై చర్యలు

## అనుమానాస్పద వ్యక్తులకు గదులు ఇవ్వొద్దు: సీఐ రామ నరసింహారెడ్డి

**ధర్మపురి, మే6 (నినాదం):** ధర్మపురి పట్టణంలోని లాడ్జ్ యజమానులకు పోలీసులు కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. పట్టణ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బుధవారం లాడ్జ్ యజమానులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామ నరసింహారెడ్డి మాట్లాడుతూ లాడ్జ్‌లలో గదులు కేటాయించే ముందు ప్రతి అతిథి నుంచి ఆధార్ కార్డు లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచిం చారు. వారి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.లాడ్జ్ ప్రాంగణమంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా చూడాలని తెలిపారు.



నిబంధనలు పాటించని యజమా నులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులకు గదులు ఇవ్వడం వల్ల నేరాలకు అవకాశం ఏర్పడే ప్రమాదం ఉందని, యజమా నులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో పట్టణ ప్రాంత ప్రతినిధులు, లాడ్జ్ యజమానులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. పోలీసు శాఖ సూచనలను తప్పనిసరిగా అమలు చేస్తామని లాడ్జ్ యజమానులు హామీ ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి...



**జమ్మికుంట, మే6 (నినాదం)** హుజురాబాద్ మండలం చెల్పూరు ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని ఢీ కొట్టగా వ్యక్తి మృతి చెందారు. హుజురాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన కత్తి సమ్మయ్య అనే డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# వాణిజ్య పంటలను సాగు చేసి అత్యధికంగా లాభాలు పొందండి

వరికి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించండి
రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నా రెడ్డి
రైతులు సాయిల్ హెల్త్ కార్డులకు దరఖాస్తులు చేసుకోండి : కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి







**వనపర్తి ప్రతినిధి, మే6 (నినాదం) :** భారతదేశంలో బాగా డిమాండ్ ఉన్న వాణిజ్య పంటలను సాగు చేసి అత్యధికంగా లాభాలు పొందాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి చెప్పారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో జిల్లా ఉద్యానవనాలు, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంటల మార్పిడిపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల చిన్నా రెడ్డి మాట్లాడుతూ 140 కోట్ల మంది జనాభా కలిగిన భారత దేశంలో ప్రజలకు అవసరమైన మేరకు ఆయిల్ గింజలు, పప్పు దినుసులు లేవని, వాటిని ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకొవటానికి మన ఫోరెన్సిక్ నిల్వలు బయటి దేశాలకు వెళ్లి పోతున్నాయని చెప్పారు. అందుకే మన దేశంలోనే ఆయిల్ గింజలు సాగు చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. నూనె గింజల్లో అత్యధికంగా ఆయిల్ వచ్చే పంట కేవలం పామాయిల్ పంటకే ఉందని, అత్యధికంగా లాభసాటి పంట ఏదైనా ఉందంటే అది పామాయిల్ పంట అని చెప్పారు. అందుకే రైతులు వరి పంట కాకుండా పామాయిల్, పప్పు గింజలు, కూరగాయల వైపు దృష్టి మళ్లించాలని సూచించారు. తన 90 ఎకరాల పొలంలో 75 ఎకరాల పామాయిల్ పంట సాగు చేస్తున్నట్లు తెలిపారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం మొక్కలు సబ్సిడీ నుంచి ఎరువులు, డ్రిప్, గుంతలు తవ్వడానికి, 4 సంవత్సరాల పాటు అంతర్ పంట సాగుకు సైతం ప్రభుత్వం సబ్సిడీనిస్తుందని అన్నారు. రైతులు పామాయిల్ పంట సాగు చేసి దాదాపు 30 సంవత్సరాల పాటు అత్యధికంగా లాభాలు పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రైతులు తమ భూములను సారవంతంగా ఉంచుకొని వరి కి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు అవగాహన కల్పించడానికి ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రైతు భూ సారా కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని,ప్రతి ఒక్కరు రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యత్వం తీసుకోవాలని, తద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే అనేక పథకాలకు అర్హత సాధిస్తారని సూచించారు. అదేవిధంగా ప్రతి రైతు కిసాన్ క్రెడిట్ కార్డు పొందాలని, సహకార సంఘంలో సభ్యత్వం తీసుకోవడం వంటివి చేయాలని చెప్పారు. పామాయిల్ పంట వేసుకునేందుకు ముందుకు వచ్చే రైతులకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి పామాయిల్ సాగు చేస్తున్న రైతుల వద్దకు తీసుకువెళ్లి అవగాహన కల్పిస్తామని చెప్పారు.రైతులు వరి మాత్రమే కాకుండా ఇతర పంటల సాగు వైపు దృష్టి సారించాలని కోరారు. రైతు కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి, ప్రత్యేక నోడల్ అధికారి ప్రసాద్ రావు, మాజీ జాయింట్ డైరెక్టర్ వ్యవసాయ శాఖ కృపాకర్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి, వీణా, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయ్ భాస్కర్, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికైన నగర పంచాయతీ కోఆప్షన్ సభ్యులకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే




**జయశంకర్‌భూపాలపల్లి, మే6(నినాదం) :** భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కో -ఆప్షన్ ఎన్నికల్లో జనరల్ కేటగిరి కో- ఆప్షన్ సభ్యుడిగా సజ్జనపు స్వామి మహిళా కేటగిరీలో చల్ల రేణుక, మైనారిటీ జనరల్ కేటగిరిలో ఎండి మిన్హాజ్ ఎన్నికయ్యారు ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రజలకు అంకితభావంతో పనిచేస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ డిసిసి ప్రెసిడెంట్ బట్టు కరుణాకర్ మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన నిర్వహించాలి

అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, మే 6 (నినాదం) :** వరి కొనుగోలు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం వనపర్తి మండలంలోని నర్సింగా యిపల్లి, కిష్టగిరి, నాచహళ్లీ, మేంటేపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకాలు, మౌలిక వసతులు, రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగుల సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత రాకుండా నిరంతరం నిల్వలను పర్యవేక్షించాలని పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు.తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే సంచుల్లో నింపి నిల్వ ఉంచేందుకు వీలుగా ప్రతి కేంద్రానికి తగినన్ని గన్నీ బ్యాగులను తక్షణమే అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ధాన్యంలో తాలు, మట్టి లేకుండా రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని సూచించారు. ఇందుకు ప్యాడి క్లీనర్లను వినియోగించాలని, ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం త్వరగా క్లీనింగ్ చేయడానికి, రైతులు వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి ఆయా కేంద్రాల్లో అదనపు ప్యాడీ క్లీనింగ్ మిషన్లను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం తూకం పూర్తి కాగానే మిల్లులకు తరలించేందుకు వీలుగా సరిపడా లారీలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.ఏ రోజుకారోజు ధాన్యం రవాణా జరగాలని, లారీల కొరత నెపంతో కొనుగోలు ప్రక్రియ నిలిచిపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం వచ్చేలా రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి, క్లీన్ చేసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

## పిఏసిఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన లింగంపల్లి వెంకటయ్య



**చింతపల్లి, మే 6(నినాదం) :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఘడియగౌరారం పి ఎ సి ఎస్. చైర్మన్‌గా లింగంపల్లి వెంకటయ్య అధికారికంగా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తానని, సంస్థ ద్వారా రైతులకు అందే సేవలను మరింత మెరుగుపరచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా రైతులు పండించిన ధాన్యాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులకు అందాల్సిన రాయితీలు, సబ్సిడీలు ఆలస్యం కాకుండా అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని, రైతుల సమస్యలను పరిష్కరించడంలో శాసనసభ్యులు బాలానాయక్ సహకారంతో ముందుకు సాగు తామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలను సమర్థవం తంగా అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ నల్ల సుధాకర్ రెడ్డి, డైరెక్టర్లు మధు నాయక్ , వెంకటయ్య, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొని కొత్త చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## గుంతల రహదారికి ఎస్ఐ పరిష్కారం

సొంత ఖర్చులతో మరమ్మతులు – ప్రజల ప్రశంసలు



**కోదాడ,మే 6(నినాదం):** కోదాడ పట్టణంలోని మేళ్లచెరువు రోడ్డుపై గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతుండటంతో ట్రాఫిక్ ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు.సిబ్బందితో కలిసి గుంతల్లో గ్రావెల్, సిమెంట్ వేసి సమతలీకరణ చేపట్టి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశారు. ప్రజల భద్రత కోసమే చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.స్థానికులు ఎస్ఐ సేవాభావాన్ని అభినందిస్తున్నారు.

## కుల సంఘాల జేఏసీ ఏర్పాటు సమావేశం



**కాటారం, మే6 (నినాదం):** ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు అజ్మీరా పూల్ సింగ్ నాయక్, పీక కిరణ్, రామగిరి రాజు, సడవలి రావు బుధవారం కాటారం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మే 7 గురువారం రోజున కాటారంలో జేఏసీ ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. జిల్లాలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఈ జేఏసీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇటీవల ప్రజలపై దాడులు, కుల వివక్ష, పోలీసుల అక్రమ కేసులు పెరుగుతున్నాయని, అలాగే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో భవనాలు, రోడ్ల నిర్మాణాల్లో ఆలస్యం జరుగుతోందని విమర్శించారు. ఈ కారణంగా అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని అన్నారు. జిల్లాలోని అన్ని కుల సంఘాలు ఐక్యంగా కలిసి జేఏసీ ఏర్పాటులో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ఈవీఎం గోదాము భద్రత పటిష్టంగా కొనసాగించాలి

కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, మే6 (నినాదం):** జిల్లా కేంద్రంలోని ఈ.వి.యం గోదాము భద్రత పటిష్టంగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న ఈవీఎం గోదాము ను నెలవారీ తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఆర్డీవో సుబ్రమణ్యంతో కలిసి పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం నెలవారి తనిఖీలు చేసినట్లు వివరించారు. తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు

## నేటి నుండి ఆత్మకూర్ జూరాల మీదుగా గద్వాలకు రాకపోకలు నిలిపివేత



**అమరచింత, మే 6, (నినాదం):** ఆత్మకూరు నుండి జూరాల మీదుగా గద్వాలకు వెళ్లే రహదారి పై నేటి నుండి రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆత్మకూరు ఎస్సై జయన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెన్కో నుండి నీటి విడుదల కారణంగా రాకపోకలకు అంతరాయం కలుగుతుందనే ఉద్దేశంతో రహదారిని తాత్కాలికంగా మూసి వేసినట్లు తెలిపారు. నేడు ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి ప్రయాణికులు ఎవరు ఇటు నుంచి వెళ్లేందుకు సాధ్యపడదని ఎస్సై తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గద్వాలకు వెళ్లాలని ఎస్సై జయన్న సూచించారు.

## పిఏసిఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చాపల యాదగిరి రెడ్డి



**డోర్నకల్ /మరిపెడ మే 06(నినాదం) :** మరిపెడ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా చాపల యాదగిరి రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల పక్షాన నిలబడి రైతులకు న్యాయం చేస్తానన్నారు. వరి ధాన్యం కొనుగోలు లో అలసత్వం నిర్వహించకుండా త్వరితగతిన ధాన్యాన్ని తరలించే విధంగా చర్యలు తీసుకుంటాను అన్నారు.రైతులు ఎవరు వద్దని పడవద్దు అని అండగా ఉంటానని తెలిపారు...

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



**గోపాల్ పేట, మే6 (నినాదం) :** గోపాల్ పేట మండలం పోల్కెపహాడ్ గ్రామానికి చెందిన వనమోని శేషయ్య కుమారుడు వనమోని శివ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండలాల మాజీ ఇంచార్జ్ మంద సత్యశీలారెడ్డి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మానవతా దృక్పథంతో స్పందించి వారి కుటుంబానికి రూ.5000 వేల ఆర్థిక సాయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్క బంగారయ్య, ఉప సర్పంచ్ వనమోని జంపన్న, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంత కుమార్, గ్రామస్తులు మల్లయ్య, మహేశ్వరం, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## జన గణన సామాగ్రి పంపిణీ



**మిర్యాలగూడ, మే6 (నినాదం):** మిర్యాలగూడ మండల పరిధిలో జనాభా గణనలో భాగంగా గృహ గణన -2026 లో భాగంగా సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు గణన సామాగ్రిని తహసీల్దార్ పి. శ్రీనివాస్ బుధవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ మండలంలోని 46 గ్రామపంచాయతీలలో గృహ వివరాలు సేకరణ నమోదుకై 20 మంది సూపర్వైజర్లు, 120 మంది ఎన్యూమరేటర్లను నియమించినట్టు ఆయన తెలిపారు. 157 హౌజ్ బ్లాక్లుగా ఏర్పాటు చేసి ఆయా బ్లాకుల్లో ఎన్యూమరేటర్లను ఏర్పాటు చేసి ముందు గృహ గణన చేసిన అనంతరం జనాభా గణన ఉంటుందన్నారు. ప్రతి ఆవాసాన్ని సందర్శించి గణన చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సహాయ గణాంక అధికారి పి.రవీందర్ రెడ్డి ఉన్నారు.

## హిందూ ఆలయాల జోలికొస్తే కాంట్రాక్టర్, కాంగ్రెస్ నాయకుల ఇండ్లను ముట్టడిస్తాం : రానా ప్రతాప్ రెడ్డి



**నర్సంపేట, మే6 (నినాదం) :** వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్ నగర్ గ్రామం లో కాకతీయుల నాటి పురాతన శివాలయం కూల్చివేయగా విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాపరెడ్డి సందర్శించారు అనంతరం రానా మాట్లాడుతూ కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు నిర్మించిన, 700-800 ఏళ్ల చరిత్ర కలిగిన అశోక్ నగర్ మట్టి కోట శివాలయాన్ని ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో కూల్చివేయడం అంటే హిందూ సమాజంపై దాడి చేయడమేనని అన్నారు పురావస్తు శాఖ,దేవాదాయ శాఖ అధికారులారా, సిగ్గుందా అని అధికారులపై కాటుక ద్వజమెత్తారు చారిత్రక సంపదను,హిందువుల మనోభావాలను కాపాడాల్సిన మీరు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు ఒక పురాతన ఆలయాన్ని కాంట్రాక్టర్ కూల్చేస్తుంటే మీ కళ్ళు మూసుకుపోయాయా మీ నిర్లక్ష్యం, చేతగానితనం వల్లనే ఈ రోజు మన వారసత్వ సంపద నేలమట్టం అయింది అని ఆవేదన వ్యక్తం చేశారు ఎప్పటికి అయిన వరంగల్ జిల్లా కలెక్టర్ వెంటనే అశోక్ నగర్ మట్టి కోటను స్వయంగా పరిశీలించి, హిందువుల మనోభావాలను గౌరవించి న్యాయం చేయాలని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేసారు ఈ దుర్మార్గానికి కారణమైన కాంట్రాక్టర్ వెంటనే హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి. కూల్చిన చోటే, అదే శిల్పకళతో శివాలయాన్ని పునర్నిర్మించాలి అన్నారు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను వెంటనే మరో ప్రభుత్వ స్థలానికి మార్చి ఆలయ భూమిలో ఒక్క రాయి కూడా కదల్చిన ఊకునేది లేదు అని అన్నారు రెండు రోజుల్లో డిమాండ్లు నెరవేర్చకపోతే, ఆ కాంట్రాక్టర్ ఇంటిని, ఈ అరాచకానికి వత్తాసు పలుకుతున్న కాంగ్రెస్ నాయకుల ఇళ్లను బీజేపీ ఆధ్వర్యంలో వేలాది మంది కార్యకర్తలతో ముట్టడిస్తాం. అభివృద్ధి పేరుతో హిందూ ఆలయాల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు అభివృద్ధి మాకు వద్దని కాదు. కానీ మా సంస్కృతిని, చరిత్రను, దేవాలయాలను కాపాడితే చాలు అని అన్నారు

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై వెంకటేశ్వర గౌడ్

1930 హెల్ప్‌లైన్ ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలి
సందేహాస్పద లింక్‌లపై క్లిక్ చేయొద్దు హెచ్చరిక
పోలీసుల పేరుతో వచ్చే నకిలీ నోటీసులపై అప్రమత్తత అవసరం



**పెబ్బేరు, మే 06 (నినాదం):** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, సందేశాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని పెబ్బేరు ఎస్సై వెంకటేశ్వర గౌడ్ సూచించారు. బుధవారం చెలిమిళ్ళ సమీపంలో మిస్టర్ టీ స్టాల్ నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులో ఎస్సై మాట్లాడారు. ఈ సందర్భంగా సైబర్ మోసాలపై ప్రజలకు వివిధ జాగ్రత్తలు తెలియజేశారు. పోలీసుల పేరుతో ఫోన్ చేసి ఆధార్ వివరాలు అడిగితే స్పందించవద్దని, అలాంటి కాల్స్ పూర్తిగా మోసపూరితమని హెచ్చరించారు. మీరు ఎవరితోనూ చెప్పకూడదు అంటూ ఒత్తిడి తెచ్చే వ్యక్తుల మాటలు నమ్మవద్దని, వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే అనుమానాస్పద సందేశాలకు స్పందించకూడదని, యూపీఐ ద్వారా పొరపాటున డబ్బులు పంపామని చెప్పి తిరిగి ఇవ్వమని కోరేవారు మోసగాళ్లేనని తెలిపారు. గందరగోళ పరిస్థితుల్లో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, ఆ నంబర్‌ను బ్లాక్ చేయడం ఉత్తమ మార్గమన్నారు. నీలం రంగులో కనిపించే అనుమానాస్పద లింక్‌లను ఎప్పుడూ క్లిక్ చేయవద్దని, సీబీఐ, ఐటీ శాఖ, ఉన్నత పోలీసు అధికారుల పేరుతో వచ్చే నోటీసులను తప్పనిసరిగా అధికారిక వెబ్‌సైట్ల ద్వారా ధృవీకరించుకోవాలని సూచించారు. డిజిటల్ భద్రతలో భాగంగా చిరునామా, ఫోన్ నంబర్, ఆధార్, పాన్, పుట్టిన తేదీ వంటి వ్యక్తిగత వివరాలను ఫోన్ లేదా సందేశాల ద్వారా ఎవరికీ పంచుకోవద్దని, తెలియని కాల్స్‌కు స్పందించకుండా వెంటనే డిస్‌కనెక్ట్ చేసి బ్లాక్ చేయాలని సూచించారు. కాల్ సమయంలో ఒత్తిడి, భయపెట్టే ప్రయత్నాలు చేస్తే అవి స్కామ్‌లేనని గుర్తించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పెబ్బేరు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించడంతో పాటు 100, 1930 హెల్ప్‌లైన్ నంబర్లకు కాల్ చేయాలని, లేదా ఞఎవతీ-ఎతీఅఎవ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొని సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకున్నారు.

## బెల్ట్ (షాపు)లు తీస్తామంటున్న గ్రామ ప్రథమ పౌరులు

గ్రామాల్లో మొదలైన నిషేధ తీర్మానాలు
ఉప్పులపల్లె లో మొదలైన బెల్ట్ షాపుల నిషేధం
కమలాపూర్, ఉప్పల్ గ్రామాల్లో నిషేధ తీర్మానాలు
ఈ నెల15 వరకు గడువిచ్చిన రెండు గ్రామాలు



**కమలాపూర్, మే6 (నినాదం) :** మండలంలోని గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపుల ను నిషేధించాలని గ్రామ పంచాయతీ పాలక వర్గాలు తీర్మానాలు మొదలు పెట్టాయి. గ్రామాల్లో సమయం సందర్భం రాత్రి పగలు అనే తేడా లేకుండా బెల్ట్ షాపుల వ్యవహారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెల్ట్ షాప్ యజమానులు వారి ఇష్టమొచ్చిన రేట్లకు మద్యం ప్రజలకు విక్రయిస్తూ ప్రజల ఇల్లు గుల్ల చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రజల మందు ప్రియుల అవసరాలను ఆసరా చేసుకుని కల్తీ మద్యం సైతం విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని ఎప్పటి నుండో మండలంలో ప్రజలు చర్చించు కుంటున్నారు. కాని ఎక్సైజ్ అధికారులు ఎన్నడు పట్టించు కున్న పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో గ్రామ సర్పంచ్ లు గా ఎక్కువగా విద్యా వంతులు ఎన్నికయ్యారు. గ్రామాల్లో నడుస్తున్న మద్యం బెల్ట్ దుకాణాల వల్ల యువతమధ్య వయసు వారు మద్యం తాగడానికి అలవాటు పడడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా సామాజికంగా ఎంతో నష్ట పోతున్నాయని గుర్తించిన గ్రామ పంచాయతీ పాలక వర్గాలు గ్రామాల్లో బెల్ట్ షాపులు నిషేధం విధించాలని నిర్ణయం తీసుకున్నారు.మండలంలోని ఉప్పులపల్లె గ్రామ సర్పంచ్ ర్యాకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి గ్రామంలో బెల్ట్ షాపులు నిషేధించాలని తీర్మాణం చేసి అమలు పరుస్తున్నారు. దాంతో పాటుగా కమలాపూర్, ఉప్పల్ గ్రామ పంచాయతీ ల సర్పంచ్ లు పబ్బు సతీష్, మొండెద్దుల రమ నాగరాజు, లు సైతం గ్రామాల్లో బెల్ట్ షాపులు నిషేధించాలని తీర్మానాలు చేసి అమలు పర్చుటకు నిర్ణయించారు. ఈ మేరకు బెల్ట్ షాపుల యజమానులకు వారి వద్ద ఉన్న మద్యం నిలువలను ఈ నెల15 వరకు అమ్ముకోవాలని నోటీసులు ఇచ్చారు. అ తరువాత బెల్టుషాపులు నిర్వాహకులు ఎవరు మద్యం అమ్మకాలు జరిపినా 10 వేల రూపాయల జరిమాన విధించ నున్నట్లు ప్రచారం నిర్వహిస్తున్నారు.జరిమానాలతో పాటుగా కేసునమోదు చేయడానికి అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.అదేవిధంగా ఈ మూడు గ్రామాలతో పాటుగా మండలంలోని గ్రామాల్లో కూడా బెల్ట్ షాపులు నిషేధించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఆయుధ వినియోగంలో ప్రావీణ్యం సాధించాలి

ప్రజల భద్రతలో పోలీసుల పాత్ర అత్యంత కీలకం
విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలే
జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ప్రతి పోలీసు అధికారి ఆయుధాల వినియోగంపై పూర్తి ప్రావీణ్యం సాధించాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. వరంగల్ జిల్లా అమ్మవారిపేట ఫైరింగ్ రేంజ్‌లో నిర్వహించిన వార్షిక మొబిలైజేషన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన హాజరై అధికారుల ఫైరింగ్‌ను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఆయుధాల పనితీరును పరిశీలిస్తూ, వివిధ రకాల ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆయుధాల వినియోగంలో నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వేగంగా, సమర్థవంతంగా స్పందించే సామర్థ్యం పోలీసు సిబ్బందిలో పెంపొందుతుందని తెలిపారు. సీనియర్ అధికారులు ఎస్‌హెచ్‌ఓలు తమ సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీస్‌పై పూర్తి అవగాహన కల్పించాలని, ఫైరింగ్ గ్రౌండ్‌లో పాటించాల్సిన నియమ నిబంధనలను స్పష్టంగా వివరించాలని ఆదేశించారు. ప్రజల భద్రతలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, అందుకు అవసరమైన శిక్షణను నిరంతరం అభ్యసించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తుపాకులతో విధులు నిర్వహించే అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని, ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు పోలీసుల ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి శాంతిభద్రతల పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతి అధికారి అప్రమత్తత, క్రమశిక్షణ, సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ సంపత్ రావు, కాటారం డిఎస్పి సూర్యనారాయణ,సి.ఐలు, ఆర్.ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం

రైతులు నష్టపోకుండా ప్రత్యేక చర్యలు

ధాన్యం రవాణా, హమాలీలు, గన్నీ బ్యాగులపై సమగ్ర ఏర్పాట్లు చేయాలి

మంథని మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యన్నీ పరిశీలించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**మంథని, మే6 (నినాదం) :** తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి మార్కెట్ యార్డ్ లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతు లు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపటా లని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ ద్వారా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా కల్పించారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రవాణా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మేర గన్నీ బ్యాగులు, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు.రైతులకు నష్టం కలగ కుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతు సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ఆయన వెంట మంథని ఆర్డిఓ సురేష్, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐటీడీఏ పిఓ మంద మకరందు



**నిర్మల్ ప్రతినిధి, మే6 (నినాదం):** నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ (గా) మంద మకరందు బుధవారం మర్యా దపూర్వకంగా కలుసు కున్నారు. కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో పీవో కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో ఐటీడీఏ పరిధిలో సాగుతున్న పలు అభివృద్ధి పనులపై ఇరువురు చర్చించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, విద్యా, వైద్య సదుపాయాలు మరియు పరిపాలనాపరమైన అంశాలపై పీవో కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం



మంచిర్యాల, మే 6(నినాదం): మంచిర్యాల రైల్వే స్టేషన్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు రైల్వే అధికారులు ఆమోదం తెలిపారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. మంచిర్యాల టు టౌన్ ప్రాంతానికి రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో పలు మార్లు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి గారికి, బండి సంజయ్ కుమార్ గారికి, ఎంఎల్సీ అంజి రెడ్డి గారికి మరియు సౌత్ సెంట్రల్ జీఎం గారికి వినతి పత్రం అందజేయడంతో స్పందించిన సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు సుమారు 4 కోట్ల రూపాయల వ్యయంతో గత ఏడాది అక్టోబర్ లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు మంచిర్యాల మున్సిపల్ కమీషనర్ గారికి ఈరోజు నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం లేఖ రాయడంతో వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి క్లియరెన్స్ కోసం నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరడం జరిగిందని పేర్కొన్నారు. మంచిర్యాల టు టౌన్ ప్రాంతానికి అండర్ బ్రిడ్జి ప్రారంభించాక రైల్వే గేట్ మూసి వేయడంతో వివిధ పనుల కోసం నడిచి వస్తున్న వారికి, విద్యార్థులకు మరియు దినసరి కూలీలు ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో పలు మార్లు స్థానిక బీజేపీ నాయకులు కేంద్ర మంత్రుల దృష్టికి, సౌత్ సెంట్రల్ రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించడం జరిగింది అని అన్నారు. అక్టోబర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ గారు మంచిర్యాల కు వందే భారత్ రైలు ప్రారంభోత్సవానికి వచ్చిన మంచిర్యాలకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయడం జరిగింది అని తెలిపారు. ఈరోజు సౌత్ సెంట్రల్ రైల్వే నుండి మంచిర్యాల మున్సిపల్ కమీషనర్ గారికి వచ్చిన నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ తొందరగా మంజూరు చేసి ఇవ్వాలని అన్నారు. ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ వల్ల వేల మంది ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల ముఖేష్ గౌడ్, కార్పొరేటర్లు బోట్ల అనిత, కస్తూరి నాగరాజు, పురుషోత్తం జాజు, రాకేష్ రెన్వ, అమిరిశెట్టి రాజ్ కుమార్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, డేగ బాపు, బెల్లంకొండ మురళి, సత్రం రమేష్, ప్రేమ్ సింగ్, రౌతు వెంకటేష్, తరుణ్ సింగ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యపుసంచులు నిల్వచేయడానికి అదనపు స్థలాలు సమకూర్చుకోవాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ ప్రతినిధి, మే6 (నినాదం):** ధాన్యపు సంచులు నిల్వ చేయడానికి ముందు జాగ్రత్తగా అదనపు స్థలాలు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం సారంగాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి గోదామును వెంటనే సిద్ధం చేయాలన్నారు. అవసరమైతే అదనంగా ధాన్యపు సంచులు నిలువ చేయడానికి స్థలాలను అన్వేషించాలని అన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ధాన్యాన్ని అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. సిసి కెమెరాలు, లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్ విజయ కాంతారావు, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్లకు అతీతంగా ఐక్యతే మార్గం

మల్లయ్య పిలుపు"

టిజికేఎస్ ఆవిర్భావం నేపథ్యంలో జీడికె-2 లో కేంగర్ల మల్లయ్య పర్యటన



**గోదావరిఖని, మే 06: (నినాదం) :** తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య (ం+దీఖూ) మే 4న ఆవిర్భవించిన సందర్భంగా, కార్మిక ఉద్యమానికి కొత్త దిశను చూపించే ప్రయత్నాలు వేగవంతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, కేంద్ర కమిటీ వ్యవస్థాపక కన్వీనర్ కేంగర్ల మల్లయ్య, TGBKS నాయకుడు పెంచాల తిరుపతి ఆధ్వర్యంలో ఈరోజు GDK-2 ఇంక్లైన్ కార్మికులను మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ భవిష్యత్తుపై ఆందోళన ఈ సందర్భంగా మల్లయ్య మాట్లా డుతూ, సంస్థ ప్రస్తుత పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో మళ్లీ BIFR పరిధిలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితుల్లో కార్మికుల సంక్షేమం తీవ్రంగా దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా పోరాటమే పరిష్కారం "మన సంస్థ మరో వందేళ్లు నిలబడాలంటే, కార్మికులందరూ పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాటం చేయాలి" అని మల్లయ్య స్పష్టం చేశారు. ఐక్యతే శక్తి అని, విభజనల వల్లే సంస్థ బలహీనపడుతుందని ఆయన తెలిపారు. కార్మికుల నుంచి ఘన స్వాగతం బాయిబాటలో మల్లయ్యను కలిసిన కార్మికులు, యూనియన్లకు అతీతంగా ముందుకు వచ్చి ఆయనకు సాదర స్వాగతం పలికారు. గతంలో ఆయన సాధించిన హక్కులను గుర్తు చేసు కుంటూ, "మీ వల్లే కార్మికుల ఇళ్లకు ఇాజ వంటి సౌకర్యాలు వచ్చాయి, మా కుటుంబాలకు ఎంతో మేలు జరిగింది" అని కృతజ్ఞత తెలిపారు. కొత్త హక్కుల కోసం మరోసారి పోరాటం కార్మికులు మాట్లాడుతూ, "మీరు గతంలో సాధించిన హక్కులు తప్ప, ఇప్పటివరకు కొత్తగా ఎలాంటి హక్కులు రాలేదు. మళ్లీ మీ నాయకత్వంలో పోరాటం చేస్తేనే మార్పు సాధ్యమవుతుంది" అని అభిప్రాయపడ్డారు. ఐక్యంగా ముందుకు – కార్మికుల సంకల్పం పార్టీలకు అతీతంగా మీతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని కార్మికులు మనస్ఫూర్తిగా ప్రకటించారు. ఈ సమావేశం కార్మికుల్లో కొత్త ఆశలు రేకెత్తించడంతో పాటు, ఐక్యతతో ముందుకు సాగాలనే సంకల్పాన్ని మరింత బలపరిచింది. TGBKS ఆవిర్భావం కేవలం ఒక సంఘటన కాకుండా, కార్మికుల ఐక్యతకు నాంది కావాలని, భవిష్యత్తులో బలమైన ఉద్యమానికి మార్గదర్శకంగా నిలవాలని నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## సుల్తానాబాద్ సింగిల్ విండో అధ్యక్షుడిగా శ్రీగిరి శ్రీనివాస్

పాలకవర్గం పదవి బాధ్యతలు స్వీకరణ...

సింగిల్ విండోను మరింత ఉన్నతంగా నిలబెట్టడానికి కృషి : చైర్మన్





**సుల్తానాబాద్, మే6(నినాదం):** సుల్తానాబాద్ సింగిల్ విండో అధ్యక్షుడిగా శ్రీగిరి శ్రీనివాస్ తో పాటు పాలకవర్గం సభ్యులు బుధ వారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సం దర్భంగా అధ్యక్షుడు శ్రీగిరి శ్రీనివాస్ ని సభ్యులు, నాయకులు అభినందించారు. ధాన్యం విక్రయం లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపా రు. అభివృద్ధి పథంలో పయనిస్తున్న సుల్తానా బాద్ సింగిల్ విండోను మరింత ఉన్నతంగా నిల బెట్టడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఇన్చార్జి ఆఫీసర్ ఎన్ వెంకటేశ్వర్లు, సి ఈవో బూర్గు సంతోష్ తో పాటు సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

ది బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్ రెడ్డి



**మంథనిటౌన్, మే6 (నినాదం) :** మంథని మండల కేంద్రం లోని వ్యవసాయ మార్కెట్ ను బుధవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షులు చందుపట్ల సునీల్ రెడ్డి , నాయకులు సందర్శిం చారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నష్ట పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ధాన్యం నిల్వలు ఉన్న మార్కెట్ లో ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ యొక్క నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. రైతులు 45 రోజులుగా మార్కెట్లో పడిగాపులు కాస్తున్న ఎందుకు కాంటాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరించిన కూడా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వదలడం లేదని రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురవడం వలన రైతులు మరింత నష్టం చవి చూడకముందే వెంటనే కాంటాలు ఏర్పాటుచేసి తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కొండపాక సత్య ప్రకాష్, బోగోజు శ్రీనివాస్ , రాపర్తి సంతోష్ ,పట్టణ అధ్యక్షులు సబ్బాని సంతోష్ ,పట్టణ జనరల్ సెక్రెటరీలు సామల అశోక్ , ఎడ్ల సాగర్, మండల ఎస్సి మోర్చా అధ్యక్షులు కారంగుల రాజశేఖర్,

# తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

అన్నాతమ్ముళ్ల పంచాయతీ రైతుల మీద తీయద్దు....

కేంద్రం ఇంచార్జీ నియమించకపోవడం విడ్డూరమే

అధికారుల నిర్లక్ష్యంతోనే వడ్లు తడిసిపోయినయ్

కాంటాలు పెట్టకపోతే రోడ్డు దిగ్భందం చేస్తం

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని మే 6( నినాదం) :** తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు.మంథని మండలం అడవిసోమన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో సెంటర్ ఇంచార్జీ నియామకంలో మంథని ఎమ్మెల్యే, ఆయన తమ్ముడి పంచాయతీతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి అకాల వర్షంతో తడిసన ధాన్యంను పరిశీలించారు. కేంద్రం ప్రారంభించినా ఇప్పటి వరకు గింజ కొనుగోలు చేయకపోవడంపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని ఎమ్మెల్యే పోలీస్ పహారాలో మంథనిలోని మార్కెట్ యార్డును సందర్శించి ఎలాంటి ఇబ్బందులు లేవని, సక్రమంగా కొనుగోళ్లు జరుగుతున్నాయని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేవలం రాత్రి విపత్తు తప్ప మరోప్రమాదం ఏమీ లేదన్నారని ఆయన విమర్శించారు. మంథని ఎమ్మెల్యే బుల్లెట్ ప్రూఫ్ కార్లలో తిరుగుతుంటే ఏమీ కనబడటం లేదని, ఆయన తర్వాత ఆయన తమ్ముడిని బుల్లెట్ ప్రూఫ్ కార్లలో పోలీస్‌పహారాలో తిప్పుతాడని ఆయన ఎద్దేవా చేశారు. అడవిసోమన్‌పల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తమ పంటను తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నా కాంటాలు పెట్టలేదని, రైతులు రోడ్డెక్కి ధర్న చేస్తే హుటాహుటీని కాంటాలు, గన్నీసంచులు తీసుకువచ్చారే కానీ కొనుగోళ్లు మాత్రం ప్రారంభించలేదన్నారు.ఇప్పటి వరకు ధాన్యం సేకరణ మొదలు పెట్టకపోవడంతో అకాల వర్షానికి కేంద్రంలో యాభై శాతం వడ్లు తడిసిపోయాయని, మరోసారి వర్షం కురిస్తే మొత్తం తడిసిపోతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ఇంచార్జీ నియామకంలో మంథని ఎమ్మెల్యే ఒకరిపేరు, ఆయన తమ్ముడు మరొకరి పేర్లు చెప్తుండటంతో ఇంచార్జీని నియమించడంలేదని, అన్నాతమ్ముళ్ల తగువులాటలో కళ్లం బోసిపోయి తమకు తీరని నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. మంత్రి ప్రాతినిధ్యం వహించే మండలంలో ఇంకా ఒక్క గింజ కొనుగోలు చేయకపోవడం అవమానమేనని ఆయన విమర్శించారు. జిల్లా కలెక్టర్ సైతం కాంగ్రెస్ నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతున్నాడని, ప్రజలకు ఐదు పైసల పని చేయకుండా కాంగ్రెస్సోళ్లు ఏ పని చెప్పినా చేస్తున్నాడని అన్నారు. కలెక్టర్ ఐఏఎస్ చదువుకుంది కాంగ్రెస్ జెండా మోయడానికి కాదనేది గుర్తించాలని ఆయన హితవు పలికారు. కేంద్రాలను పర్యవేక్షించి అక్కడి సమస్యలను పరిష్కరించాలే కానీ రైతులను ఇబ్బందులకు గురి చేసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. అడవిసోమన్‌పల్లిలో రైతుల ఇబ్బందులకు కాంగ్రెస్ నాయకులే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆనాడు ఎన్నికల సమయంలో గ్యారెంటీ కార్డు పట్టుకుని అనేక మాయమాటలు చెప్పారని, ఈనాడు సైతం తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నన్ని రోజులు ప్రజలు సంతోషంగా ఉండరని, ప్రజలు ఎనాడైతే తిరస్కరిస్తారో ఆరోజునే సంతోషంగా ఉంటారన్నారు. మంథని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అడవిసోమన్‌పల్లి కేంద్రంలో కొనుగోళ్లు మొదలుపెట్టాలని, కేంద్రంలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు, లేని పక్షంలో మంథని కాటారం రోడ్డును దిగ్భందిస్తామని, రైతులను న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కడా ఆగకూడదు

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు తడిసిన ధాన్యాన్ని తిరస్కరించవద్దు

టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్



**పెద్దపల్లి రూరల్,మే 6(నినాదం):** జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కడా ఆగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు,వర్షాల ప్రభావంపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరకు ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించవద్దని, ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ఆ ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడానికి ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ ఎక్కడా ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టి సమీప పీ.పీ.సీ,కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తగినంత తార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నాయని,రైతులు వాటిని వినియోగించుకోవాలని అన్నారు. రైతులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని,ప్రతి ధాన్య గింజ కొనుగోలు చేయబడుతుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు.ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో డిసిఓ శ్రీ మాల,డీఎం సివిల్ సప్లై శ్రీకాంత్,డీ.ఎస్.ఓ శ్రీనాథ్,డి.ఎం.ఓ ప్రవీణ్ రెడ్డి,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బొంపల్లిలో శ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపనలో మాజీ ఎమ్మెల్యే



**పెద్దపల్లి రూరల్ మే6 (నినాదం):** పెద్దపల్లి మండలంలోని బొంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో కార్యక్రమంలో పెద్దపల్లి బీ.ఆర్.ఎస్ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బొంపల్లి గ్రామానికి చెందిన తెలుగుపల్లె ముదిరాజ్ కులస్తులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ని ఆహ్వానించి ఘన స్వాగతం పలికారు.ఆలయానికి చేరుకున్న ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం గ్రామ ప్రజలు,రైతాంగం సుఖసంతోషాలతో ఉండాలని,అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ గ్రామంపై కురవాలని ప్రార్థించారు.కార్యక్రమంలో పాల్గొన్న ముదిరాజ్ కులస్తులు దాసరి మనోహర్ రెడ్డి ని శాలువాతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.గ్రామ పెద్దలు, యువకులు,మహిళలు,భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో బీ.అర్.ఎస్,నాయకులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల సమన్వయ కర్తగా డా.బి.వెంకట్ కవి



**నిర్మల్ ప్రతినిధి, మే6 (నినాదం):** నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత డా. బి. వెంకట్ కవికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల సమన్వయకర్తగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్, జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరిభూషణం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. వచ్చే నెల జూన్ 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఈ మహాసభలు వైభవంగా జరగనున్నాయి. తెలుగు భాషా వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సభలను, వెంకట్ కవి తన నిర్వహణా నైపుణ్యంతో విజయవంతం చేయగలరని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. డా. బి. వెంకట్ కవి ప్రస్తుతం సంస్కృత భాషా ప్రచార సమితి ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడిగా, తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు ఈ కీలక బాధ్యత లభించడం పట్ల జిల్లా సాహిత్య రంగ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మే 6,(నినాదం):** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, పౌరసరఫరాల శాఖ అధికారులు, రవాణా గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో గోదాములను తక్షణమే ప్రారంభించి, ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని నిల్వ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 10 రైస్ మిల్లులు పని చేస్తున్నాయని, సుముఖ్ గోదాం సామర్థ్యం 20 వేల మెట్రిక్ టన్నులు ఉండగా, ఇతర గోదాముల సామర్థ్యం మొత్తం 61 వేల మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. ఈ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తూ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం రైస్ మిల్లర్లకు మిల్లింగ్ చార్జీలు ఇప్పటికే విడుదల చేసినందున మిల్లర్లు ఆలస్యం చేయకుండా బిల్లుల ప్రకారం వరి ధాన్యం తీసుకుని మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మిల్లుల బ్యాంక్ గ్యారంటీలను సమీక్షించి, అర్హత ఉన్న మిల్లులకు వరి ధాన్యం విడుదల చేయాలని, జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రవాణా వాహనాలను మిల్లులకు తగిన విధంగా కేటాయించి, వరి ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి తప్పనిసరిగా శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో సన్నాల సాగు 90 శాతానికి పైగా ఉన్నందున, కొనుగోలు పరిమాణాన్ని గత సంవత్సరాల కంటే మరింత పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా సహకార శాఖ అధికారులతో వరి ధాన్యం కొనుగోలు పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ సంవత్సరంలో జిల్లాలో వరి ధాన్యం దిగుబడి అంచనా సుమారు 1 లక్ష 50 వేల మెట్రిక్ టన్నుల నుండి 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వచ్చే అవకాశం ఉందని, కొనుగోలు కేంద్రాలలో వరి శుభ్రపరిచే యంత్రాలను ఏర్పాటు చేసి, రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో హమాలి చార్జీలకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రవాణా గుత్తేదారులతో కుదుర్చుకున్న ఒప్పందాలు పూర్తైన తరువాత మాత్రమే రవాణా చార్జీలు చెల్లించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి, బిఆర్ఎస్ పార్టీల తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజం

తెలంగాణపై కేంద్రం వివక్ష.. 10 ఏళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదు

రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

రుణమాఫీతో రైతులకు అండగా ఉన్నాం, ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం: మంత్రి పొన్నం

**హుస్నాబాద్ మే 6 (నినాదం)**



తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివక్ష చూపుతోందని, గత పదేళ్లుగా రాష్ట్రానికి ఏం చేశారో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీకి నిధులు ఇస్తే తమకు అభ్యంతరం లేదని, కానీ తెలంగాణకు నిధులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. తెలంగాణను పాకిస్థాన్‌తో పోలుస్తూ, అమరవీరుల త్యాగాలను అవమానించేలా మాట్లాడటం బిజెపి నాయకుల అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటులో జాప్యానికి బిజెపి రాజకీయ ఒత్తిడే కారణమని, ఆ పార్టీ ఒక తెలంగాణ ద్రోహి అని విమర్శించారు. మరోవైపు బిఆర్ఎస్ నేత కేటీఆర్ తీరుపై మంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ వంటి మానవతావాదిపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, ఆయనకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటములతో నైరాశ్యంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు, రాహుల్ గాంధీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిట్టడం ద్వారా ఉనికిని చాటుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. రైతులకు బేడీలు వేసి, లాఠీచార్జీలు చేయించిన చరిత్ర బిఆర్ఎస్ ప్రభుత్వానిదని, ఈరోజు వారు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, ఇప్పటికే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసి రూ. 21 వేల కోట్లు విడుదల చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని మంత్రి పేర్కొన్నారు. ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేంద్రం ఎందుకు సీబీఐ విచారణకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు లోపాయకారి ఒప్పందంతో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నాయని, విద్యుత్ కొనుగోలు కుంభకోణంపై నిజాలు నిగ్గు తేల్చాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల బ్యూరో మే 6 ( నినాదం)**



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర నిబంధనలతో ధాన్యం కొనుగోలులో జాప్యం

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి అడ్లూరి.. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ





**ధర్మపురి మే 6 (నినాదం)**

ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనల వల్ల కొనుగోలు ప్రక్రియ ఆలస్యమైందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యం, మక్కజొన్నలను మంత్రి బుధవారం ధర్మపురి మార్కెట్ యార్డులో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంలో ట్రక్ షీట్‌లు, జీపీఆర్ఎస్ వంటి సాంకేతిక నిబంధనల కారణంగా ధాన్యం కొనుగోలు దాదాపు 15 రోజుల పాటు ఆలస్యంగా ప్రారంభమైందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత విధానంలోనే కొనుగోళ్లు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. మార్కెట్ యార్డుల్లో ఉన్న వరి ధాన్యంతో పాటు మక్కజొన్నను కూడా వారం నుంచి పది రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తా మని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఆందోళనలకు దిగవద్దని, వారు పండించిన పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులకు లేదా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, చిలుముల లక్ష్మణ్, వేముల రాజు, సొల్ల నరేష్, చీపురుశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

పశుసంవర్ధక క్రీడా యువజన మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి





**అమరచింత, మే 6, (నినాదం):**

ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన రోగులకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడా యువజన మత్స్య శాఖ మంత్రి డాక్టర్వా కిటి శ్రీహరి అన్నారు. బుధవారం అయిన ఆత్మకూరు పట్టణంలోని శ్రీరాం పాలి క్లినిక్ ప్రైవేటు వైద్యశాలను ప్రారంభించారు.ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హిందూజ బి ఎం హెచ్ ఎస్ హోమియో, డాక్టర్ మైథిలిరాణి ఎంబీబీ ఎస్, వైద్యులను ఆయన అభినందించారు. ఆర్థిక సంపాదనను దృష్టిలో పెట్టుకోకుండా రోగులకు వైద్యం అందించాలని డాక్టర్లు దైవంతో సమానమని మంత్రి అన్నారు. ఎంతో నమ్మకాన్ని పెట్టుకుని ఆసుపత్రికి వచ్చిన వారికి మనో ధైర్యాన్ని ఇస్తూ వైద్య చికిత్సలు చేయాలని సూచించారు. ఆత్మకూరులో హోమియో, అల్లోపతి వైద్యం ఒకే దగ్గర లభించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ నాగమణి రాజేష్, వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రహమతుల్లా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పరమేష్ కార్యదర్శి తులసి రాజ్ యాదవ్, మాజీ ఎంపీపీ ఏం శ్రీధర్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గాడి కృష్ణమూర్తి, కౌన్సిలర్లు కోట్ల తిరుపతి, సద్దల తులసి వెంకట రాములు, దండు శ్రీనివాసులు, కో ఆప్షన్ సభ్యులు జహంగీర్, ఆస్పత్రి నిర్వాహకులు బలరాం, రమేష్ మూలమల్ల రాజేష్ తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్-2027 ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**గద్వాల బ్యూరో మే 6( నినాదం )**



తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ సం క్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీ ఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష-2027 కోసం మైనారిటీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 100 మంది మైనారిటీ అభ్యర్థులను ఎంపిక చేసి డిజిటల్ తరగతి గది, ప్రఖ్యాతా అధ్యాపకులు గ్రంథాలయం ఇంటర్నెట్ మరియు వైఫై సౌకర్యంతో (యూపీఎస్సీ సిఎస్సి-27) సమగ్ర శిక్షణను అందించనున్నారు. ఈ శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33% అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 5% సీట్లు కేటాయించటం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయము రూ.5 లక్షలు మించకూడదు. అభ్యర్థుల ఎంపిక కోసం 14 జూన్ 2026న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల నందు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించబడుతుంది. అభ్యర్థులు https://cet.cgg.gov.in/tmreis వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన ఆసక్తి కలిగిన మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ప్రకటన ద్వారా కోరారు. మరిన్ని వివరాల కోసం 040-23236112 నంబర్ లేదా directormscccctelangana@gmail.com ద్వారా సంప్రదించవలెనని సూచించారు.



## మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదు

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్

**నల్లగొండ ప్రతినిధి మే 6( నినాదం):**

అతివేగం మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదు అని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ సూచించారు. బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం, డ్రైవర్లతో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అధిక వేగం, అలసటతో డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. డ్రైవర్లు “డిఫెన్సివ్ డ్రైవింగ్” పాటిస్తూ ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా అనుసరించాలని సూచించారు. భారి వాహనాలకు పట్టణంలో ఉదయం 8–12 గంటలు, సాయంత్రం 4–8 గంటల మధ్య మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో 1033 నంబర్‌కు కాల్ చేయాలని, ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలిస్తే “రహవీర్ పథకం” కింద ₹25,000 నుంచి ₹1 లక్ష వరకు ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్బిసిఐ ఆదిరెడ్డి, ట్రాఫిక్ సిఐ మహా లక్ష్మయ్య, డి టి ఆర్ బి రిటైర్డ్ సిఐ అంజయ్య, మిర్యాలగూడ లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ చాంద్ పాషా, సెక్రటరీ రవీందర్ రావు, పోలీస్ అధికారులు, డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్ యజమాన్యం, తదితరులు ఉన్నారు

# మళ్ళీ వస్తాం!

## అవినీతి తిమింగలం కోసం ఏసీబీ వేట..!

మహిళా శిశు సంక్షేమ శాఖలో ఏసీబీ సోదాలు

అదనపు బాధ్యతలదే అవినీతి..

ఏసీబీ చేతిలో అధికారి అవినీతి చిట్టా..!

**జగిత్యాల ప్రతినిధి మే 6 నినాదం**



జగిత్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో దాదాపు మంగళవారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కు అధికారి లేకపోవడంతో బాధ్యత అవగాహన లేని అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో శాఖ పూర్తిగా అవినీతిమయం అయిందనే ఆరోపణలు ఊపందుకున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో పక్క ఆధారాలతో ఏసీబీ అధికారులు జగిత్యాల కలెక్టరేట్లో 8 మంది ఏసీబీ అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది సెల్ ఫోన్లు లాక్కొని కంప్యూటర్ లో ఉన్న రికార్డులను ప్రింటులు తీసుకున్నారు. రాజకీయ ప్రాబల్యంతో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులకు భజన చేసి స్థానిక ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకొని మహిళా శిశు సంక్షేమ శాఖ భ్రష్టు పట్టించారు. తన శాఖ కాకపోయినా తనకి ఏమాత్రం అనుభవం లేకపోయినా మహిళా శిశు సంక్షేమ శాఖ ని ఎన్నుకొని అదనపు బాధ్యతల పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరించారు. మహిళా ఉద్యోగులను వేధించడం... పండగలకు పంపాలకు ఇంటి వద్ద పనులు చేయించుకోవడం కింది స్థాయి ఉద్యోగులను భయపెట్టడం అనేక రకాలైన రుగ్మతలతో శాఖను అస్తవ్యస్తం చేశారు. అధికారి అవినీతి పెచ్చరిల్లడంతో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఒక్కొక్క ఫైల్ స్వాధీనం చేసుకొని సరిచూసి కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఆన్లైన్ లావాదేవీలను పరిశీలించి జిరాక్సులు తీసుకొని వెళ్లారు. మరికొన్ని ముఖ్యమైన రికార్డులను అధికారులు వెంట తీసుకెళ్లారు. ఏసీబీ దాడులు అనంతరం ఓ అధికారి మాట్లాడుతూ అవినీతి జరిగిన మాట వాస్తవమే కానీ ఎంత మేరకు ఉంటుందని ఇప్పుడే చెప్పలేమని ఏసీబీ కమిషనర్ ఆదేశాలతో మళ్లీ తిరిగి వస్తామని అప్పుడు అన్ని వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కలెక్టరేట్లో ఒకవైపు ఏసీబీ సోదాలు మరోవైపు జిల్లా రైస్ మిల్లర్లతో మంత్రి ఎమ్మెల్యేలు ముఖ్య అధికారులు ధాన్యం కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏకకాలంలో జరిగిన ఈ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. అదనపు బాధ్యతల నిర్వహణ పేరుతో ఓ అధికారి స్థానిక ఎమ్మెల్యేను కాక బట్టి మహిళా శిశు సంక్షేమ శాఖను జగిత్యాల మున్సిపాలిటీ పూర్తిగా అవినీతి కూపంలోకి నెట్టి లక్షలు పోగేసుకున్నట్లు ఇప్పటికీ తీవ్రమైన చర్చ నడుస్తుంది. ఆధారాలు చిక్కకుండా భవనాల కొలతలు తారుమారు చేసి లక్షలు పోగేసుకున్నారనే ఆరోపణలు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో మహిళా సిస్ సంక్షేమ శాఖకు అదనపు బాధ్యతల పేరుతో వెటర్నరీ శాఖకు చెందినఓ అధికారి నడిపిన అవినీతి ఎమ్మెల్యే కనుసనల్లోనే జరిగిందనే ప్రచారం జరుగుతుంది. మరో నాలుగు రోజులకు ఏసీబీ అధికారులు వెంట తీసుకపోయిన ఫైళ్ళ సమాచారాన్ని నోట్ తయారుచేసి కలెక్టర్ అప్పగిస్తారనేది సమాచారం..

జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన అధికారి మహిళా ఉద్యోగులను వేధించిన బాగోతం బయటకు పొక్కగానే అందరి దృష్టి అటువైపు మళ్ళింది. 20 ఏళ్ల నుంచి జగిత్యాల వెటర్నరీ శాఖలో విధులు నిర్వహిస్తూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు అండదండలతో అదనపు శాఖల నిర్వహణ పేరు తో అడ్డగోలుగా వ్యవహరించి లక్షలు పోగేసుకున్న అధికారి వ్యవహారం బదిలీ లేకుండా చూసుకున్నారు.. జగిత్యాల మున్సిపాలిటీకి అదనపు కమిషనర్ గా బాధ్యతలు నిర్వహించి రాష్ట్రంలోని అత్యంత అవినీతి మయమైన మున్సిపాలిటీగా తయారు చేశారు. ఇది చాలదన్నట్లు స్థానిక శిశు సంక్షేమ శాఖను అంటగట్టారు. ఈ శాఖలో మహిళా ఉద్యోగులతో అంగన్వాడి కార్యకర్తలతో అడ్డగోలుగా వ్యవహరించి చివరకు ఆ శాఖ నుంచి గెంటివేయబడ్డారు. ఏసీబీ సోదాలతో ఒక్కొక్కటి బయటకు వస్తుంది. రాష్ట్రంలోని మంత్రులు ఎమ్మెల్యేల వద్ద కార్యదర్శిగా పనిచేసిన అనుభవంతో ప్రస్తుత ఇద్దరు క్యాబినెట్ మంత్రుల వద్ద మోకరిల్లి బదిలీ లేకుండా చూసుకొని జిల్లా అదనపు శాఖల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ఇష్ట రాజ్యాంగ వ్యవహరించి చివరకు మహిళా ఉద్యోగులను వేధించే స్థాయికి దిగజారి పోయారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలను సిడిపిఓ లను సూపర్వైజర్లను వేధించడమే కాకుండా పై అధికారులు ఒత్తిడి తెస్తున్నారంటూ అడ్డగోలుగా వసూలు చేశారని ఆరోపణలు తీవ్రమయ్యాయి. ఓ సింగిల్ మహిళా ఉద్యోగిని ఫిజికల్ హరాస్మెంట్ చేయడంతో ఆమె కలెక్టర్ కలెక్టర్ ఫిర్యాదు చేసింది దీంతో ఈ అదనపు బాధ్యత అధికారి బాగోతం బయటపడి ప్రజాప్రతినిధుల ఒత్తిడితో చర్యలు లేకుండా సొంత శాఖకు అంటే వెటర్నరీ శాఖకు తిరిగివచ్చారు. ఈ శాఖలో ఉండి కూడా గతంలోఅదనపు భాధ్యతలు నిర్వహించిన శాఖలపై పెత్తనం వహిస్తూ ఫోన్ల ద్వారా బెదిరిస్తున్నారని మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నాలుగు రోజుల తర్వాత మహిళా శిశు సంక్షేమ శాఖలో చేరుతానని అప్పుడున్న తడాక్ ఏంటో చూపిస్తానని అంగన్వాడి సూపర్వైజర్లకు సిడిపిఓలకు వార్నింగ్ ఇస్తున్నట్లు చర్చ నడుస్తుంది ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా మహిళా మహిళా శిశు సంక్షేమ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఇన్చార్జి అధికారుల పదవీకాలంలో జరిగిన అవినీతిపై జిల్లా కార్యాలయంలో సోదాలు నిర్వహించి ఫైలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. కార్యాలయంలో కొంతకాలంగా జరుగుతున్న అవకతవకలు గ్యాస్ బుక్ లో అప్డేట్ చేయకుండా అవకతవకలకు పాల్పడినట్లు ఏసీబీ అధికారులు నిర్ధారించారు. జిల్లాకు మంజూరైన వికలాంగుల వాహనాల కంపెనీలో జరిగిన అవకతవకలను పరిశీలిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఏసీబీ అధికారులు చెప్పారు.





## ఆధ్యాత్మిక పారవశ్యంలో అన్నపురెడ్డిపల్లి.. మహా కుంభాభిషేకంతో భక్తి వెల్లువ

సతీసమేతంగా పాల్గొన్న మంత్రి పొంగులేటి

రాష్ట్ర సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు

**ఖమ్మం ప్రతినిధి, మే 6 (నినాదం)**

అన్నపురెడ్డిపల్లి గ్రామం బుధవారం ఆధ్యాత్మిక మహోత్సవంతో కళకళలాడింది. శ్రీశ్రీశ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించిన మహా కుంభాభిషేక మహోత్సవం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. తెల్లవారుజామున నుంచే ఆలయ ప్రాంగణం వేదఘోషలతో మారు మోగి, గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం అంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. పరమపూజ్య శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి వారి దివ్య పర్యవేక్షణలో ఈ మహా క్రతువు శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. బ్రహ్మ ముహూర్తం నుంచే అర్చకులు హోమగుండాల వద్ద ప్రత్యేక హోమాలు, జపాలు నిర్వహించారు. యజ్ఞశాలలో అగ్ని జ్వాలలు ఎగసిపడుతుండగా, వేదపండితుల మంత్రోచ్చారణలు భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లాయి. అనంతరం చినజీయర్ స్వామి వారి దివ్య హస్తాల మీదుగా కలశాలకు పవిత్ర జలాలతో అభిషేకం చేయగా, భక్తులు గోవింద నామస్మరణతో జయజయధ్వానాలు చేశారు. ఈ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహిళలు, వృద్ధులు, యువత అందరూ భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించబడింది.తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సతీమణి మాధురితో కలిసి ఈ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సుభిక్షం కోసం ప్రార్థించారు. అనంతరం మాట్లాడుతూ, “చినజీయర్ స్వామి వారి పావన హస్తాల మీదుగా కుంభాభిషేకం జరగడం మనందరికీ అదృష్టకరం. స్వామివారి కృపతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రతి ఇంటా ఆనందం నెలకొనాలని కోరుకున్నాను” అని పేర్కొన్నారు.కార్యక్రమం అనంతరం జరిగిన వేదాశీర్వచన సభలో పండితులు మంత్రి దంపతులకు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ వేడుకలో టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, జిల్లా కలెక్టర్ అంకిత్, డీసీసీ అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మొత్తానికి, మహా కుంభాభిషేక మహోత్సవం అన్నపురెడ్డిపల్లి గ్రామానికి ఒక ఆధ్యాత్మిక వేడుకగా నిలిచి, భక్తుల మనసుల్లో చిరస్మరణీయంగా మిగిలింది.

NINADAM CINEMA



## లెనిన్‌లో భాగ్యశ్రీ లుక్ విడుదల

'లెనిన్'లో అఖిల్‌తో కలిసి సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ఓ స్పెషల్ పోస్టర్‌తో ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె భారతి అనే పాత్రలో అలరించనున్నారు. తాజాగా పంచుకున్న పోస్టర్‌లో ఆమె పౌరాణిక లుక్ లో రాచరికపు దుస్తులు, భారీ ఆభరణాలు ధరించి కనిపించారు. తీక్షణమైన చూపులతో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా వాయిదా పడనుందంటూ వార్తలు రాగా నాగార్జున తన పోస్ట్‌తో వాటిని ఖండించారు. అనుకున్న తేదీ ప్రకారం జూన్ 26న ఈ సినిమా విడుదల కానున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో కొత్త అఖిల్‌ను చూస్తారని హామీ ఇచ్చారు. తాను ఫస్ట్ కట్ చూశానని అది చూశాకే నమ్మకంతో చెబుతున్నానన్నారు. చిత్తూరు నేపథ్యంలో సాగే కథ ఇది. బలమైన భావోద్వేగాలు, ఆసక్తిని రేకెత్తించే కథనంతో ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచేలా 'లెనిన్' చిత్రం రూపుదిద్దుకొంటోంది.

## 600 కోట్ల భారీ బడ్జెట్‌తో రజనీ, కమల్ మూవీ



దక్షిణాదిలో మాత్రమే కాకుండా మొత్తం భారతీయ సినీ పరిశ్రమలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారిన భారీ ప్రాజెక్ట ఏదైనా ఉందంటే అది సూపర్ స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ కలిసి నటించబోతున్న మల్టీస్టారర్ సినిమా. ఈ చిత్రాన్ని ప్రతిభావంతుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమాపై భారీ స్థాయిలో అంచనాలు నెలకొనగా, తాజాగా వినిపిస్తున్న వార్తలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. సినీ వర్గాల్లో ప్రచారం ప్రకారం ఈ సినిమాకు సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్ కేటాయించినట్లు సమాచారం. ఇది నిజమైతే భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ఖరీదైన చిత్రాలలో ఒకటిగా నిలిచే అవకాశముంది. ఈ భారీ వ్యయంలో ఎక్కువ భాగం ప్రధాన నటులు మరియు సాంకేతిక బృందం పారితోషికాలకే వెళ్తున్నట్టు తెలుస్తోంది.ముఖ్యంగా రజినీకాంత్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు ఒకే సినిమాలో నటించడం వల్ల వారి పారితోషికాలు కూడా అత్యంత భారీగా ఉన్నాయని సమాచారం. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కూడా తన విజయాల నేపథ్యంలో మంచి మొత్తాన్ని అందుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నది ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ రవిచందర్ కాగా, ఆయన సంగీతం ఈ సినిమాకు మరో ప్రధాన బలం కానుంది. ఈ భారీ ప్రాజెక్టను కమల్ హాసన్‌కు చెందిన నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ నిర్మిస్తోంది. అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రం రూపొందనుందని సమాచారం. ప్రస్తుతం ముందస్తు పనులు వేగంగా కొనసాగుతుండగా, త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. ఇంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ మల్టీస్టారర్‌ను దర్శకుడు నెల్సన్ ఎలా రూపొందిస్తాడో అన్నది ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. మొత్తానికి రజినీకాంత్ , కమల్ హాసన్ కలయిక, నెల్సన్ దర్శకత్వం, అనిరుధ్ సంగీతం కలిసివచ్చి ఈ సినిమాను భారతీయ సినీ రంగంలో ఒక కొత్త మైలురాయిగా నిలబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787